శుక్రవారం
10-03-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 257
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

ప్రపంచ స్థాయికి సైన్యం

యుద్ధాల్లో గెలవాలంటే రక్షణ వనరులు అవశ్యం: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తాజాగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సాయుధ దళాలను సాధ్యమైనంత త్వరగా అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు.

2లో

పీడీఎఫ్ అభ్యర్థులకు రెండో ప్రాధాన్యత ఓటు

టీడీపీ నిర్ణయం: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో–కర్నూలు: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థులకు రెండో ప్రాధాన్యత ఓటు వేయాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ఓటర్లకు పిలుపునిచ్చారు. మేధావులు, పట్టభద్రులు విజ్ఞతతో ఆలోచించి... ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. ఉగాది తర్వాత బకాయిలు చెల్లిస్తామని మంత్రులు కమిటీ కల్లబొల్లి మాటలు చెబుతోందని, ఈ మాటలు నమ్మాల్సిన అవసరం లేదని ఆయన చెప్పారు. టీడీపీ కార్యాలయంలో పార్టీ ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జులు, అధ్యక్షులతో గురువారం ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో అచ్చెన్నాయుడు మాట్లాడారు. నాలుగేళ్లలో ఐదు కోట్ల ప్రజల వ్యతిరేకత ఎదుర్కొన్న ప్రభుత్వం వైసీపీనేనని అచ్చెన్నాయుడు చెప్పారు. రాష్ట్రంలో వైసీపీ పాలన మినహా ఇతరులు ఉండరాదన్న సీఎం జగన్ కల నెరవేరదని తెలిపారు. టీడీపీ హయాంలో చేసిన పనులకు జగన్ ప్రభుత్వం బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు. జగన్ పాలనలో ప్రతిపక్షపార్టీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయించడం, దౌర్జన్యాలు చేయడం సర్వసాధారణమైందన్నారు. టీడీపీని లేకుండా చేయాలన్న జగన్ కల నెరవేరబోదని స్పష్టంచేశారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో 160 సీట్లతో టీడీపీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తంచేశారు. వైసీపీ పాలనలో ఏ వర్గం సంతోషంగా లేదన్నారు. ఉద్యోగులు, నిరుద్యోగులు, యువకులు, విద్యార్థులు, రైతులు, వ్యాపారులు ఇబ్బందులు

- మిగతా 2 లో

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలిస్తే
విశాఖ నుంచే పాలన!

- ఉగాదికి శ్రీకారం?
- సీఎం జగన్ బసకు ఏర్పాట్లు
- వైసీపీ నేతల్లో ఎమ్మెల్సీ ఎన్నికల భయం

విశాలాంధ్ర బ్యూరో–విశాఖపట్నం: త్వరలో విశాఖనుంచి పాలన ప్రారంభిస్తానని పెట్టుబడుల సదస్సు (గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్) సందర్భంగా సీఎం జగన్ ప్రకటించిన నేపథ్యంలో ఉగాది నుంచి విశాఖనే ఏపీకి పరిపాలన రాజధాని కాబోతోందన్న ప్రచారం జరుగుతోంది. విశాఖ నగరంలో సీఎం ఉండేందుకు నివాస భవనం సిద్ధమైందా? సీఎం ఒకవేళ విశాఖకు వస్తే అమరావతిలో అడుగుపెట్టరా? లేదంటే కొన్ని రోజులు విశాఖలో, మరికొన్ని రోజులు అమరావతిలో ఉంటారా? ఒక రాజధాని... వంద అనుమానాలపై ఇప్పుడు సరికొత్త ప్రచారం మొదలైంది. సీఎం జగన్ విశాఖకు రావడం ఖాయం అంటున్నారు ఆ పార్టీ నేతలు. అయితే ఆయన వారానికి రెండు రోజులు

- మిగతా 2 లో

వైసీపీ దూకుడుకు
కళ్లెం!

ఏకగ్రీవం ఖాయమన్న దశలో టీడీపీ ట్విస్ట్

- ఎమ్మెల్సీ ఎన్నికల్లో పంచుమర్తిని అభ్యర్థిగా నిలబెట్టాలన్న యోచనలో టీడీపీ
- అసంతృప్తివాదులపై అధికార పార్టీ నిఘా

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి : శాసనసభ్యుల కోటాలో జరగనున్న ఎమ్మెల్సీల ఎన్నికలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. ఇప్పటివరకు ఏకపక్షంగా ఈ ఎన్నికలు సాగుతాయని అధికారపార్టీ భావిస్తున్న నేపథ్యంలో తెలుగుదేశం పార్టీ పోటీకి సన్నద్ధమైంది. శాసనసభ్యుల కోటాలో ఎన్నికకు టీడీపీ నుంచి అభ్యర్థిని పోటీకి దించాలని భావిస్తోంది. ఈ విషయంపై గురువారం పార్టీ ముఖ్యనేతలతో అధినేత చంద్రబాబు చర్చించారు. ఎమ్మెల్యేల కోటాలో ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. ఈనెల 13తో నామినేషన్ల గడువు ముగియనుంది. దీంతో అభ్యర్థిని నిలిపే అంశంపై పార్టీ ముఖ్య నేతలతో చంద్రబాబు సమాలోచనలు చేస్తున్నారు. ఒక్కో స్థానంలో అభ్యర్థి గెలవాలంటే 22 నుంచి 23 ఎమ్మెల్యేల ఓట్లు అవసరం. ప్రస్తుతం టీడీపీ తరఫున 23 మంది శాసనసభ్యులు ఉండగా, వారిలో నలుగురు పార్టీకి దూరంగా ఉంటున్నారు. గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ, చీరాల ఎమ్మెల్యే కరణం బలరాం, విశాఖ దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేశ్, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే మద్దాల గిరి వైసీపీలో చేరారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో విప్ జారీ చేయాలని టీడీపీ భావిస్తోంది. ఆయా ఎమ్మెల్యేలు విప్‌కు అనుగుణంగా ఓటు వేయాల్సి ఉంటుంది. విప్‌ను ఉల్లంఘిస్తే ఆయా ఎమ్మెల్యేలపై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయొచ్చని టీడీపీ భావిస్తోంది. నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 16వ తేదీ వరకు తుది గడువు. ఇప్పటివరకు టీడీపీకి అవసరమైన శాసనసభ్యుల బలం లేనందున ఎన్నికలు ఏకగ్రీవమవుతాయని వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులంతా భావించారు. ఆ పార్టీ అధిష్ఠానం కూడా అదే ఆలోచనతో ఉంది.

వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులంతా గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. టీడీపీ తరఫున ఎవరూ నామినేషన్ వేయకపోతే 16వ తేదీన వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులంతా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించనున్నారు. టీడీపీ పోటీ చేస్తే 23న పోలింగ్ జరుగుతుంది. అదే జరిగితే వైసీపీ తమ పార్టీ రెబెల్ శాసనసభ్యుల బెడదను ఎదుర్కోవల్సి వస్తుంది. వీరంతా విప్‌ను ధిక్కరించి టీడీపీ అభ్యర్థికి ఓటేస్తే పార్టీలో తిరుగుబాటు ఎక్కువయ్యే ప్రమాదముందని వైసీపీ భయపడుతోంది. ఎన్నికల సందర్భంగా వైసీపీ కూడా విప్ జారీ చేస్తుంది. సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో పదవీ త్యాగానికి సిద్ధపడి విప్‌ను ధిక్కరించే అవకాశం లేకపోలేదన్న ఆందోళన అధికార పార్టీ నేతల్లో ఉంది. ఇప్పటికే ఎంపీ రఘురామకృష్ణ రాజుతోపాటు, ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, ఆనం రాంనారాయణ రెడ్డి వంటి వారు బహిరంగంగానే వైసీపీ అధిష్ఠానాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఇదే బాటలో మరికొందరు శాసనసభ్యులు అధిష్ఠానంపై అంతర్గతంగా అసంతృప్తితో ఉన్నారు. శాసనసభ్యుల కోటాలో ఎమ్మెల్సీ ఎన్నికలకు జరిగే పోలింగ్‌ను ఇటువంటి అసమ్మతివాదులైన వైసీపీ శాసనసభ్యులు సద్వినియోగం చేసుకుంటే రాజకీయ పరిణామాలు ఎటు దారి తీస్తాయోనని వైసీపీ అధిష్ఠానం ఆందోళన వ్యక్తంచేస్తోంది.

తాజా పరిణామాల క్రమంలో వైసీపీ అసమ్మతివాదుల కదలికలపై ఇంటిలిజెన్స్ యంత్రాంగం నిఘా పెంచినట్లు సమాచారం. శాసనమండలి సభ్యులు నారా లోకేశ్, చల్లా భగీరథరెడ్డి, పోతుల సునీత, బచ్చుల అర్జునుడు, డొక్కా మాణిక్య వరప్రసాద్, పెనుమత్స సూర్యనారాయణరాజు, గంగుల ప్రభాకర్‌రెడ్డి పదవీకాలం ఈనెల 29న ముగియనుంది.

నేడు త్రిపురకు లెఫ్ట్ ఎంపీలు

- ఎన్నికల హింస ప్రభావిత ప్రాంతాల్లో పర్యటన
- బాధిత కుటుంబాలకు పరామర్శ

న్యూదిల్లీ: ఎన్నికల క్రమంలో హింస జరిగిన త్రిపురను తమ ఎంపీలు పర్యటించనున్నట్లు భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి తెలిపారు. సీపీఐ, సీపీఎంతో పాటు ఇద్దరు కాంగ్రెస్ ఎంపీల బృందం త్రిపురలో పర్యటిస్తుందని, హింస ప్రభావిత ప్రాంతాలోను సందర్శించి బాధిత కుటుంబాలను పరామర్శిస్తుందని వెల్లడించారు. ఆ రాష్ట్ర గవర్నర్‌ను కలిసేందుకు కసరత్తు జరుగుతున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీ, త్రిపుర కాంగ్రెస్

- మిగతా 2 లో

ఉద్యోగుల ఉద్యమబాట

ప్రారంభమైన నిరసనలు

- 17, 20 తేదీల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో పర్యటనలు
- 21 నుంచి ఏప్రిల్ 5 వరకు వర్క్ టు రూల్
- 27న కారుణ్య నియామకాల బాధిత కుటుంబాలకు పరామర్శ
- ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గం నిర్ణయాలు

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: 'ఉద్యోగుల డిమాండ్లపై జగన్ సర్కారు ఇచ్చిన లిఖితపూర్వక హామీ(మినిట్ల)లో స్పష్టత లేదు. స్పష్టతలేని హామీ వల్లే ఉద్యమాన్ని కొనసాగిస్తున్నాం. గురువారం నుంచి ఏప్రిల్ 5 వరకు నల్లబ్యాడ్జీలతో నిరసన ప్రారంభిస్తున్నాం' అని ఏపీ జేఏసీ అమరావతి ప్రకటించింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, విశ్రాంత, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ జేఏసీ అమరావతి రాష్ట్ర కార్యవర్గం తీర్మానం మేరకు ఇప్పటికే ఉద్యమ కార్యాచరణ ప్రకటించారు. దానిపై ఈనెల 7వ తేదీన ఉద్యోగ సంఘాలతో మంత్రివర్గ ఉపసంఘం చర్చలు జరిపింది. అవి మొక్కుబడిగానే సాగాయి. దీనికి ఏపీ జేఏసీ అమరావతి పక్షాన నేతలు హాజరై...ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర అంశాల్ని మంత్రుల కమిటీ దృష్టికి తీసుకెళ్లింది. ప్రభుత్వం నుంచి స్పష్టత లేనందున గురువారం విజయవాడ రెవెన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్ బొప్పరాజు అధ్యక్షతన అత్యవసర కార్యవర్గం భేటీ అయింది. దీనికి సెక్రటరీ జనరల్ పలిశెట్టి దామోదరరావు, అసోషియేట్ చైర్మన్ టీవీ ఫణిపేర్రాజు, కోశాధికారి

- మిగతా 2 లో

విజ్ఞత ప్రదర్శించండి

- పీడీఎఫ్, మద్దతుదారులకు మొదటి ప్రాధాన్యత
- టీడీపీ అభ్యర్థులకు రెండో ప్రాధాన్యత ఓటు వేయండి
- ఉపాధ్యాయ, విద్యావంతులకు రామకృష్ణ పిలుపు

2లో

కల్పలతారెడ్డీ...
రాజీనామా ఏదీ ?

మేనిఫెస్టో బుట్టదాఖలు: వామపక్ష పార్టీల ఆగ్రహం

విశాలాంధ్ర బ్యూరో–అమరావతి: 'ఉపాధ్యాయ లోకానికి కలగా మిగిలిన యూనిఫైడ్ సర్వీస్ రూల్స్‌ను సాధించడం నా మొదటి ప్రాధాన్యత...దీనిని ఆర్నెల్లలోపు సాధించకుంటే పదవికి రాజీనామా చేస్తాను...' ఇది వైసీపీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి రెండేళ్ల క్రితం ఎన్నికల సమయంలో ఇచ్చిన వ్యక్తిగత హామీ. కల్పలతారెడ్డి ఎమ్మెల్సీగా ఎన్నికై మార్చి 31 నాటికి రెండేళ్లు పూర్తవుతుంది. దీని ఆధారంగా ఆమె తన పదవికి రాజీనామా చేయాల్సి ఉంది. దీంతోపాటు అనేక హామీలను ఎన్నికల ముందు ప్రకటించి, ఆ మొత్తం రెండేళ్లలోపు అమలు చేయకుంటే పదవిని తృణప్రాయంగా వదిలేస్తానని ఆమె ప్రచార కరపత్రం ద్వారా ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవుగా రెండేళ్లు ఇస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఏడాది పాటు ఆ సెలవు వర్తించేలా కృషి చేస్తానని చెప్పారు. మహిళా ఉద్యోగులకు నెలసరి సమయంలో ఇప్పుడున్న ఐదు ప్రత్యేక సెలవులకు అదనంగా మరో ఐదు ప్రత్యేక క్యాజువల్ సెలవులు అందిస్తానని హామీ ఇచ్చారు. పాఠశాల విద్య, ఉన్నత విద్య, సాంకేతిక విద్య, జూనియర్ కళాశాల విభాగాల్లోని అన్నిస్థాయి పోస్టుల భర్తీకి కృషి చేస్తానన్నారు. ప్రభుత్వంచే నడుపుతున్న వివిధ రకాల సంక్షేమ వసతి గృహాల సమస్యల్ని పరిష్కరిస్తానని నమ్మబలికారు. ఎయిడెడ్ పాఠశాలల్లోని పోస్టుల భర్తీ, పదోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటానని, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని చెప్పుకొచ్చారు. మేనిఫెస్టోను భగవద్గీత, బైబిల్, ఖురాన్‌గా

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సింగిల్ ఓటుకి ఎంతిస్తారు?
పది ఓట్లకు ఎంతిస్తారు?
హోలు మొత్తంగా ఏమైనా కన్సెషన్ ఉందా??

అరెస్ట్ చేయకుండా ఆపండి

- ఆడియో, వీడియో రికార్డింగ్‌కు అనుమతించండి
- న్యాయవాది సమక్షంలోనే విచారణ జరపాలి
- సీబీఐ నోటీసులపై హైకోర్టును ఆశ్రయించిన అవినాశ్ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో– అమరావతి : ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బాబాయి వైఎస్ వివేకానంద రెడ్డి హత్య కేసులో ఎంపీ అవినాశ్ రెడ్డి అరెస్ట్ అయ్యే అవకాశాలు కనపడుతున్నాయి. ఈ నెల 10వ తేదీన విచారణకు హాజరు కావాల్సిందిగా సీబీఐ తాజాగా నోటీసులు జారీ చేసింది. దీంతో సీబీఐ తనను అరెస్ట్ చేయకుండా ఆదేశాలు జారీ చేయాలంటూ ఎంపీ అవినాశ్ రెడ్డి గురువారం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు.160 సీఆర్‌పీసీ కింద నోటీస్‌లు ఇచ్చారు కాబట్టి ముందస్తు చర్యలు తీసుకోకుండా ఆదేశించాలని హైకోర్టులో ఆయన రిట్ పిటిషన్ దాఖలు చేశారు. సీబీఐ అధికారులు తనను చేసే విచారణను ఆడియో, వీడియో రికార్డింగ్ చేసేలా అనుమతి ఇవ్వాలని, న్యాయవాది సమక్షంలో విచారణ జరపాలని పిటిషన్‌లో కోరారు. వివేకా హత్య కేసులో ఏ4గా ఉన్న దస్తగిరిని ఇప్పటివరకు సీబీఐ అరెస్ట్ చేయలేదని, ఆయన ముందస్తు బెయిల్ పిటిషన్‌ను

- మిగతా 2 లో

తప్పు చేయలేదు
విచారణ ఎదుర్కొంటా

- తెలంగాణలో బీజేపీ ఆటలు సాగవు
- అందుకే ఈడీ ప్రయోగం
- నవంబరు, డిసెంబరులో ఎన్నికలు!
- దిల్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత

న్యూదిల్లీ: 'నేను ఎటువంటి తప్పు చేయలేదు...ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)విచారణను ధైర్యంగా ఎదుర్కొంటా... బీజేపీ తెలంగాణలో దొడ్డిదారిన అధికారం చేజిక్కించుకోలేదు కనుక కేంద్రప్రభుత్వం ఈడీని ప్రయోగిస్తోంది' అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, భారత జాగృతి అధ్యక్షురాలు కవిత గురువారం పేర్కొన్నారు. దిల్లీ మద్యం కుంభకోణం కేసులో తనకు నోటీసులివ్వడంపై కవిత దిల్లీలో మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. 9న విచారణకు రావాలని ఈడీ నోటీసు ఇచ్చిందని, 11న విచారణకు తమ ఇంటికి రమ్మని ఈడీని కోరానన్నారు. ఈమేరకు ఈడీకి సమాచారం ఇచ్చినా ఈడీ ఒప్పుకోలేదన్నారు. వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఎందుకు విచారించరని కవిత ప్రశ్నించారు. దర్యాప్తు సంస్థలు మహిళ ఇంటికి వచ్చి విచారించాలని చట్టం చెబుతోందని, మహిళలను విచారించే పద్ధతిపై అవసరమైతే సుప్రీంకోర్టుకు వెళ్తామన్నారు. ఇది తన ఒక్కరి సమస్యే కాదని, ఈడీ ఎందుకింత హడావుడిగా దర్యాప్తు చేస్తోందో అర్థం కావడం లేదని కవిత చెప్పారు. తనతోపాటు ఎవర్ని విచారించినా తనకు ఇబ్బంది లేదన్నారు. ఎన్నికల నేపథ్యంలో అధికారంలో లేని రాష్ట్రాల్లో మోదీ కంటే ముందు ఈడీ వస్తోందని కవిత ఆరోపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని కూల్చే ప్రయత్నం చేశారని, అది సాధ్యం కాకపోవడంతో తనను టార్గెట్

- మిగతా 2 లో

'మా చావులు... వారికి లాభాలు'

- గ్రీస్ వీధుల్లో మార్మోగిన నినాదం
- రైలు ఘటనకు దేశవ్యాప్త నిరసన - భారీ ర్యాలీలు
- వేలాదిగా పాల్గొన్న కార్మికులు, విద్యార్థులు, యువత
- ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్

ఏథెన్స్: 'మా చావులు... వారికి లాభాలు' అన్న నినాదం గ్రీస్ నగరాన్ని దద్దరిల్లించింది. ఫిబ్రవరి 28న లారిస్సాలో జరిగిన ఘోర రైలు దుర్ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలన్న డిమాండు మార్మోగింది. రైలు ఘటనకు నిరసనగా గ్రీస్‌లో దేశవ్యాప్తంగా నిరసన ప్రదర్శనలు జరిగాయి. వేలాది మంది కార్మికులు, స్కూలు పిల్లలు, విద్యార్థులు, యువతీ యువకులు ర్యాలీల్లో పాల్గొన్నారు. బాధ్యత వహించకుండా పాలకులు తప్పించుకోలేరని నినదించారు. ఈనెల 5వ తేదీన ఏథెన్స్‌లోని సైంటాగ్మా స్క్వేర్ వద్ద రైల్వే కార్మికుల 48 గంటల సమ్మెకు కొనసాగింపుగా తాజా ప్రదర్శనలు జరిగాయి. దుర్ఘటనలో 57 మంది మరణించగా మృతుల్లో యువత ఎక్కువగా ఉండటంతో ప్రభుత్వంపై ప్రజలు కన్నెర్రచేశారు. మనుషుల జీవితాలు, భద్రతను పణంగా పెట్టి నేరపూరిత విధానాలను అమలు చేస్తుండటం ఇటువంటి పరిణామానికి దారితీసిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ దుర్ఘటనకు కారణమైన వారిని ఉపేక్షించేందుకు వీల్లేదని, బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 'ఈ నేరాన్ని కప్పిపుచ్చలేరు. ఆధునిక-సురక్షిత-సరసమైన ప్రజారవాణా సౌకర్యాలు కల్పించాలి. లాభాపేక్షను విడనాడి నేరపూరిత విధానాలను రద్దు చేయాలి' అని నిరసనకారులు నినదించారు. ఓమోనియా నుంచి సైంటాగ్మా స్క్వేర్ వరకు ఈ నినాదం మారుమ్రోగింది. అటు ఏథెన్స్‌లోని వీధులన్నీ నిరసనకారులతో నిండిపోయాయి. "సమయం బాగాలేక ఘోరం జరిగిందని అనవద్దు. కేపిటలిస్టు లాభాలు, దానిని గడించే ప్రభుత్వాన్ని పాలకులనే నిందించాలి' అన్న నినాదం గ్రీస్‌వ్యాప్తంగా వినిపించింది. కార్మిక సంఘాలు, విద్యార్థి, యువజన, ప్రజా సంఘాల వారు నిరసనల్లో పెద్దఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వ విధానాలను దుయ్యబట్టారు' అని విలేకరులతో మాట్లాడిన గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ కేంద్ర కమిటీ ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కౌంట్‌సోంబస్ అన్నారు. ఏథెన్స్‌తో పాటు థెస్సాలోనికి, పాత్రాస్, లారిస్సా వంటి పెద్ద నగరాల్లో, లోయన్నినా, ఛనియా, హెరాక్లైన్, రోడ్స్ ద్వీపంలోనూ భారీగా నిరసనలు జరిగాయి. దాదాపు దశాబ్దంలో ఇంత స్థాయిలో ప్రజలు నిరసన జరగలేదని స్థానిక మీడియా పేర్కొంది.



ప్రపంచ స్థాయికి సైన్యం

యుద్ధాల్లో గెలవాలంటే రక్షణ వనరులు అవశ్యం: చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

బీజింగ్: తమ దేశ అణచివేతకు అమెరికా నేతృత్వంలో చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయన్న చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ తాజాగా ప్రపంచ స్థాయి ప్రమాణాలతో సాయుధ దళాలను సాధ్యమైనంత త్వరగా అభివృద్ధి చేసుకోవాలని పిలుపునిచ్చారు. జాతీయ వ్యూహాత్మక సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాలని అన్నారు. యుద్ధాల్లో గెలవాలంటే రక్షణ వనరులు ఎంతో అవసరమని, వాటిని పెంచుకోవాలని సూచించారు. రక్షణ సాంకేతిక పరిజ్ఞానంపై పరిశోధనలు పుంజుకోవాలని, మరే దేశంపై ఆధారపడాల్సిన అవసరం రాకుండా అవసరమైన పరిశోధనలను ముమ్మరం చేయాలని జాతీయ ప్రయోగశాలలకు జిన్‌పింగ్ ఆదేశాలిచ్చారు. సాంకేతిక పరిజ్ఞానం, సరఫరా గొలుసులు, నిల్వల తరహా రక్షణపరమైన వనరుల వినియోగాన్ని చైనా మెరుగుపర్చుకోవాలని, తద్వార సైన్యాన్ని మరింత శక్తిమంతమైనదిగా తయారు చేసుకోవడంతో యుద్ధాల్లో గెలవొచ్చని పార్లమెంటు వార్షిక సమావేశంలో జిన్‌పింగ్ ఉద్ఘాటించారు. 'సమగ్ర వ్యూహాత్మక సామర్థ్యాల మెరుగుదల అధికార కమ్యూనిస్టు పార్టీకి కొత్త ఏర్పడిన ఆవశ్యకత. పారిశ్రామిక సరఫరా గొలుసుల స్వావలంబన పెరగాలి. మౌలికవసతుల నిర్మాణం జరగాలి. రక్షణ అవసరాల కోసం జాతీయ వనరులు అవసరం' అని జిన్‌పింగ్ తెలిపారు. అమెరికాతో పాటు ఇతర దేశాల విషయంలో చైనా మరింత స్పష్టమైన వైఖరితో ముందుకెళుతోందన్నారు. తైవాన్ కోసం శక్తిని వాడటంలేదన్నారు. సైన్యం పరిష్కరించాల్సిన అవసరమున్న వ్యూహాత్మక ముప్పులు ఏమిటో మాత్రం ఆయన చెప్పలేదు.

డబ్ల్యూహెచ్‌ఓ ఆసియా డైరెక్టర్‌పై వేటు

- జాత్యాహంకారం, దుష్ప్రవర్తన కారణంగా తొలగింపు
- అక్టోబరులో కొత్త డైరెక్టర్ ఎన్నిక : డైరెక్టర్ జనరల్ ట్రెడోస్

లండన్: ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) తమ ఆసియా డైరెక్టర్‌పై వేటు వేసింది. ఆయనపై జాత్యాహంకారం, దుష్ప్రవర్తన ఆరోపణలు రుజువు అయినందునే పదవి నుంచి తొలగిస్తున్నట్లు ప్రకటించింది. కోవిడ్ మహమ్మారి వేళ ఐరాస ఆరోగ్య సంస్థ ప్రతిస్పందన విషయంలో రాజీ పడటమే కాకుండా సిబ్బందిపై జాత్యాహంకారాన్ని ప్రదర్శించడం, వారిని దూషించడం, అనైతికంగా ప్రవర్తించడం వంటి ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. దీనిపై అంతర్గత దర్యాప్తు నిర్వహించగా అవి నిజమని తేలడంతో డబ్ల్యూహెచ్‌ఓ ఆసియా డైరెక్టర్ డాక్టర్ తకేషి కసాయ్ నియామకాన్ని రద్దు చేస్తూ సంస్థ డైరెక్టర్ జనరల్ ట్రెడోస్ అధానోమ్ ఘెబ్రేయేసస్ ఆదేశాలిచ్చారు. ఈ మేరకు ఈమెయిల్‌ను డబ్ల్యూహెచ్‌ఓ ఉద్యోగులకు ఆయన పంపారు. అందులో డాక్టర్ తకేషికి బదులు ఆయన హోదా 'పశ్చిమ పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్' అని మాత్రమే రాశారు. కొత్త ప్రాంతీయ డైరెక్టర్ నియామకం ప్రక్రియ వచ్చే నెల నుంచి ప్రారంభమవుతుందని, అక్టోబరులో ఎన్నికలు ఉంటాయన్నారు. ఈ హోదా కోసం డాక్టర్ తకేషి పేరును జపాన్ ప్రభుత్వం సిఫార్సు చేసింది. అయితే తాజా పరిణామంపై ఇంకా స్పందించలేదు. తకేషి దుష్ప్రవర్తన గురించి అనేకమంది ఉద్యోగులు ఫిర్యాదు చేసినట్లు గతేడాదిలో అసోసియేషన్ ప్రెస్ వెల్లడించింది. దీనిని తీవ్రంగా పరిగణించిన డబ్ల్యూహెచ్‌ఓ అంతర్గత దర్యాప్తు నకు ఆదేశాలిచ్చింది. దర్యాప్తు నివేదికలో ఆరోపణలు రుజువు కావడంతో ఆయనను పదవి నుంచి తొలగించింది.

మరిన్ని చిక్కుల్లో సిసోడియా

మనీలాండరింగ్ కేసులో అరెస్టు చేసిన ఈడీ

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో జైలుకెళ్లిన ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాను తాజాగా మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేసింది. సీబీఐ కేసులో బెయిల్ లభించకముందే ఆయనను ఈడీ అదుపులోకి తీసుకుంది. తీహార్ జైలులో సిసోడియాను రెండు రోజులుగా ఈడీ అధికారులు ప్రశ్నించారు. విచారణకు సహకరించలేదని, ప్రశ్నలకు సమాధానాలను ఇవ్వలేదని దర్యాప్తు సిసోడియాపై ఆరోపణలు చేశారు. అయితే బెయిల్‌పై శుక్రవారం ఢిల్లీలోని రౌస్ అవెన్యూ కోర్టులో విచారణ జరగనున్న తరుణంలో అరెస్టు చేయడం చర్చనీయాంశంగా మారింది. సిసోడియాను శుక్రవారం కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఈడీ అధికారులు తెలిపారు.

బయటకు రానివ్వకూడదనే: కేజ్రీవాల్

సిసోడియాను బయటకు రానివ్వకుండా చేసేందుకు ఈడీ ఆయనను అరెస్టు చేసిందని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. సీబీఐకి ఎలాంటి ఆధారాలుగానీ డబ్బుగానీ లభించలేదని, దీంతో శుక్రవారం బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిగి ఆయన విడుదల అవుతారనే ఈడీ ఆయనను అదుపులోకి తీసుకుందని ఆయన ట్విట్టర్‌లో వ్యాఖ్యానించారు. మనీశ్ సిసోడియాను బయటకు రాకుండా చేయడమే లక్ష్యంగా రోజుకో కొత్త నకిలీ కేసును సృష్టిస్తూ ఆయనను వేధిస్తున్నారని అసహనం వ్యక్తంచేశారు. ఇదంతా ప్రజలు గమనిస్తున్నారని, వారికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నిస్తూ కేజ్రీవాల్ ట్వీట్ చేశారు.

విజ్ఞత ప్రదర్శించండి



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో ఉపాధ్యాయ, పట్టభద్రుల శాసనమండలి స్థానాలకు జరుగనున్న ఎన్నికల్లో ఉపాధ్యాయులు, విద్యావంతులు విజ్ఞత ప్రదర్శించాలని, పీడీఎఫ్, పీడీఎఫ్ మద్దతు ఇస్తున్న అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటును, తెలుగుదేశం పార్టీ అభ్యర్థులకు రెండవ ప్రాధాన్యత ఓటును వేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తున్న వైసీపీ అభ్యర్థులను ఓడించాలని గురువారం ఒక ప్రకటనలో ఆయన కోరారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజాస్వామిక విలువలు అంతరించిపోతున్నాయన్నారు. సీఎం స్థాయిలో ఉన్న జగన్ వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేశారని, ప్రతి అంశంలో నియంతృత్వ వైఖరిని అవలంబిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఉపాధ్యాయుల, ఉద్యోగుల ప్రాథమిక హక్కులను కాలరాశారని, బెదిరింపులకు, దుర్మార్గాలకు, పోలీసులను ప్రయోగించి అక్రమ అరెస్టులకు పాల్పడుతున్నారని విమర్శించారు. గత అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన వాగ్దానాలలో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని, కనీసం ప్రతినెలా 1వ తేదీన జీతాలు కూడా ఇవ్వలేని దుస్థితి తీసుకొచ్చారన్నారు. గతంలో ఏ ముఖ్యమంత్రి ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జోక్యం చేసుకోలేదని, జగన్ అధికార దాహంతో, అన్నీ తనకే ఉండాలనే దురాశతో, ప్రజాస్వామ్యానికి పాతరేస్తున్నారని తప్పుపట్టారు. ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ వైసీపీ అభ్యర్థులను పెట్టి, అధికారులను బదిలీ చేయడం, అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారన్నారు. ప్రతిపక్ష పార్టీల వారిపై దౌర్జన్యాలకు, బెదిరింపులకు దిగుతున్నారని దుయ్యబట్టారు. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దొంగ ఓట్లు ప్రజాస్వామిక వ్యవస్థను అపహాస్యం చేస్తున్నాయని, అంతేకాకుండా చివరి ఎత్తుగా కోట్లాది రూపాయలను వెదజల్లి విద్యావంతులను సంతలో పశువుల మాదిరిగా కొనుగోలు చేసేందుకు సిద్ధమయ్యారన్నారు. ఈ నియంతృత్వాన్ని, దుర్మార్గాన్ని తిప్పికొట్టాల్సిన బాధ్యత విద్యావంతులపై ఉందని పిలుపునిచ్చారు. అన్ని విధాలుగా అక్రమాలకు పాల్పడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను భ్రష్టుపట్టిస్తున్న వైసీపీ అభ్యర్థులను ఓడించి, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సి బాధ్యత విద్యావంతులపై ఎంతైనా ఉందన్నారు.

విశాఖ నుంచే పాలన!

(మొదటిపేజీ తరువాయి)

మాత్రమే విశాఖలో ఉండబోతున్నారట. సోమవారం ఉదయం వచ్చి సోమ, మంగళవారాలు విశాఖలో బస చేయనున్నారట. ఈ రెండు రోజులు విశాఖ నుంచే పరిపాలన ఉండబోతోందట. అధికారులతో సమీక్షలు, సమావేశాలు ఇక్కడ నుంచే జరగబోతున్నాయట. ఇక ప్రతి బుధవారం రాష్ట్రంలో ఏదో ఒక జిల్లాలో గ్రామ పర్యటనకు వెళ్లాలని సీఎం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఎంపిక చేసిన గ్రామానికి వెళ్లి రాత్రికి అక్కడే పల్లె నిద్ర చేస్తారట. మళ్లీ ఉదయాన్నే అక్కడే సమీక్ష సమావేశం నిర్వహించి గురువారం అక్కడ నుంచి అమరావతి వెళ్తారట. శుక్ర, శని, ఆదివారాలు సీఎం జగన్ అమరావతిలో ఉండబోతున్నారు. శుక్రవారం అధికారిక సమావేశాల అనంతరం అవసరమైతే వారాంతంలో అక్కడ నుంచే జిల్లాల పర్యటన చేయనున్నారు. విశాఖకు రాజధాని మార్పునకు సంబంధించి పూర్తి స్పష్టత వచ్చి, అవసరమైన భవనాల నిర్మాణం పూర్తయ్యే వరకు షెడ్యూల్ ఇలా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. రిషికొండలో నిర్మితమవుతున్న సీఎం అధికారిక నివాసం, క్యాంప్ ఆఫీస్ పూర్తయ్యే వరకు విశాఖలో హార్బర్ పార్క్ పేరుతో ఉన్న విశాఖ పోర్ట్ గెస్ట్‌హౌస్‌లో సీఎం జగన్ బస చేయబోతున్నారని సమాచారం. సువిశాలమైన ఆవరణలో ఉన్న ఈ గెస్ట్ హౌస్ లో ఒక వీఐపీ సూట్‌తో పాటు కొన్ని మినీ సూట్లు, వీఐపీ రూమ్స్ ఉన్నాయి. చుట్టూ పచ్చదనంతో అవసరమైన పార్కింగ్ స్పేస్ కూడా ఉంటుంది. భద్రతాపరంగాను ఇది వ్యూహాత్మక ప్రాంతం అన్నది అధికారుల అంచనా. పోర్ట్ భద్రతను పర్యవేక్షించే సీఐఎస్ఎఫ్ బలగాల పర్యవేక్షణలో ఈ గెస్ట్ హౌస్ ఉంటుంది. కేవలం కిలోమీటర్ దూరంలో బస్టాండ్, రైల్వే స్టేషన్‌లు ఉన్నాయి. 15 కిలోమీటర్ల దూరంలో ఎయిర్ పోర్ట్ ఉంటుంది. అన్ని విధాల అనువైన ప్రాంతంగా దీన్ని ఎంపిక చేసినట్లు సమాచారం. ఉగాది తర్వాత విశాఖ నుంచే పరిపాలన అన్న దానిపై అధికార వర్గాలు ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోయినా దీనిపై విస్తృతంగా చర్చిస్తున్నట్లు తెలుస్తోంది. విశాఖలో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, మంత్రులు అమర్‌నాథ్, బొత్స సత్యనారాయణ, బూడి ముత్యాలనాయుడు, ధర్మాన ప్రసాదరావు ప్రతి సమావేశంలో వచ్చే నెల నుంచి విశాఖ నుంచి పరిపాలన అంటూ ప్రచారం చేస్తున్నారు. కాగా ఉత్తరాంధ్ర పట్టబదుల ఎమ్మెల్సీ ఎన్నికలను వైసీపీ ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఉన్న మంత్రులతో పాటు ఎంపీలు, ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలు, నేతలంతా ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ గెలిస్తే ఆ ఊపుతో ఉత్తరాంధ్ర జిల్లాలు... విశాఖ కేంద్రంగా రాజధానిని ఆహ్వానిస్తున్నాయని ప్రచారం చేయవచ్చని, తద్వారా విశాఖ నుంచి సీఎం పరిపాలన ప్రారంభించవచ్చనేది వ్యూహం.

కల్పలతారెడ్డీ...రాజీనామా ఏదీ ?

(మొదటిపేజీ తరువాయి)

భావిస్తానని చెబుతూ వాటిని రెండేళ్లలోపు అమలు చేయకుంటే తాను రాజీనామా చేస్తానన్నారు. ఆమె ఇచ్చిన ప్రకారమే నిర్దీత సమయానికి హామీలు అమలు చేయనందున తక్షణమే కల్పలతారెడ్డి తన పదవికి రాజీనామా చేయాలని సీపీఐ, సీపీఎం నేతలు డిమాండ్ చేస్తున్నారు.

శాసనమండలిలో ప్రస్తావన అంతంత మాత్రమే

తాను ఇచ్చిన హామీలను గాలికొదిలేసిన కల్పలతారెడ్డి...ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ మద్దతు ఉపాధ్యాయ, పట్టభద్రుల అభ్యర్థుల గెలుపు కోసం ప్రచారం చేయడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటివరకు జరిగిన శాసనమండలి సమావేశాల్లోనూ ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా తాను ఇచ్చిన హామీలపై గట్టిగా నిలదీసిన సందర్భాలు లేవు. కేవలం ప్రభుత్వానికి మద్దతుగా అరకొరగా ప్రశ్నించారు. సహచర ఉపాధ్యాయ, స్వతంత్ర, పట్టభద్రుల ఎమ్మెల్సీలు నిత్యం జీరో అవర్లోను, ప్రశ్నోత్తరాలలోనూ విద్యారంగ సమస్యలపైనా, ఉపాధ్యాయ సమస్యలపైనా నిరంతరం మాట్లాడారు. స్వతంత్ర ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల్ని లేవనెత్తి...వాటి పరిష్కారం దిశగా కృషి చేసిన సంఘటనలు అనేకం ఉన్నాయి. యేటా జంబో డీఎస్సీ ఇస్తామన్న సీఎం జగన్ హామీని అమలు చేయాలంటూ మండలిలో పీడీఎఫ్, స్వతంత్ర ఎమ్మెల్సీలు చాలాసార్లు పట్టుపట్టగా, దానిపై కల్పలతారెడ్డి మౌనం వహించారు. వీటన్నింటినీ మరచిన కల్పలతారెడ్డి....ఇప్పుడు వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల విజయం కోసం ప్రచారం చేయడం విడ్డూరంగా ఉంది.

వేతనాల జాప్యంపై ప్రశ్నించరేం?

ప్రతినెలా ఉద్యోగ, ఉపాధ్యాయుల వేతనాల జాప్యంపై పీడీఎఫ్, స్వతంత్ర ఎమ్మెల్సీలు ప్రభుత్వాన్ని ప్రశ్నించినప్పటికీ...కల్పలతారెడ్డి ఆ దిశగా కృషి చేయలేదు. వేతనాల కోసం రాష్ట్ర ప్రభుత్వంపై పెద్దగా ఒత్తిడి చేయలేదు. కల్పలతారెడ్డి భర్త ప్రతాప్‌రెడ్డి కడప ఆర్జేడీ(పాఠశాల విద్య)లో విధులు నిర్వహిస్తున్నారు.

ఆమెకు తోడుగా ప్రతాప్‌రెడ్డి వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతూ, ప్రలోభాలకు గురిచేస్తూ ప్రచారం చేస్తున్న ఘటనలు వెలుగుచూశాయి. ఆర్జేడీపై ఎన్నికల సంఘానికి, గవర్నరుకు ఫిర్యాదులు వెళ్లాయి. అయినా వెనక్కి తగ్గకుండా వైసీపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఆయన ముందుకుపోతున్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు రాజీనామా చేయకుండా వైసీపీ అభ్యర్థుల విజయానికి ఎలా ప్రచారం చేస్తారని వామపక్ష పార్టీల నేతలు నిలదీస్తున్నారు. తక్షణమే కల్పలతారెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.

విచారణ ఎదుర్కొంటా

(మొదటిపేజీ తరువాయి)

చేశారన్నారు. తమ పార్టీకి చెందిన సుమారు 15 మంది నేతలపై దర్యాప్తు సంస్థల దాడులు జరిగాయని ఆమె గుర్తు చేశారు. మోదీ వన్ నేషన్ - వన్ ఫ్రెండ్ స్కీమ్ తెచ్చారని, విపక్షాలను టార్గెట్ చేయడం పనిగా పెట్టుకున్నారన్నారు. అధిక ధరలు, నిరుద్యోగాన్ని తగ్గించే ప్రయత్నం చేయాలని ఆమె కేంద్రానికి సలహా ఇచ్చారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నవారు బీజేపీలో చేరగానే క్లీన్‌చిట్ ఇస్తున్నారని కవిత చెప్పారు. తాము ఎవరికీ బీ టీమ్ కాదని, ఎప్పటికీ ఏ టీమేనన్నారు. తన తండ్రి, సోదరుడితో పాటు పార్టీ మొత్తం తనకు అండగా ఉంటుందన్నారు. తెలంగాణ నేతల్ని విచారించడం కేంద్రానికి అలవాటైపోయిందన్నారు. మోదీ పార్లమెంట్‌లో కూడా అబద్ధాలు చెబుతున్నారని, గాంధీ పుట్టిన దేశంలో అబద్ధం రాజ్యమేలుతోందన్నారు. మోదీ ఎన్ని కుట్రలు చేసినా ధర్మం గెలుస్తుందని కవిత చెప్పారు. తాను ధైర్యంగా ఈడీ విచారణకు వెళ్తున్నా... బీఎల్ సంతోష్ ఎందుకు భయపడుతున్నారని కవిత ప్రశ్నించారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, మహిళా బిల్లు కోసం 27 ఏళ్లుగా పోరాటం జరుగుతోందని కవిత చెప్పారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా బిల్లు ఆమోదం పొందలేదన్నారు. 2014, 2018 మహిళా బిల్లుపై బీజేపీ మేనిఫెస్టోలో హామీ ఇచ్చారని కవిత గుర్తు చేశారు. మహిళా బిల్లును కోల్డ్ స్టోరేజ్‌లో పెట్టారని విమర్శించారు. మహిళా బిల్లు ఆమోదం కోసం ఈ నెల 10న శుక్రవారం ఢిల్లీలో నిరాహార దీక్ష చేపడతానని, రేపటి ధర్నాలో 18 పార్టీలు పాల్గొంటాయని ఆమె చెప్పారు. పూర్తి మెజార్టీతో గెలిపించినా మహిళా బిల్లుపై బీజేపీ మాట తప్పిందని, మహిళా బిల్లుపై రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు తేవడంలో సోనియా పాత్ర అమోఘమని కవిత ప్రశంసించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టంగా మారేలా చూడాలని ఆమె రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కోరారు. ఈడీ విచారణకు మనస్ఫూర్తిగా సహకరిస్తానని కవిత స్పష్టం చేశారు. నవంబరు, డిసెంబరులో తెలంగాణలో ఎన్నికలు రావచ్చని, ఎన్నికలకు ముందు దర్యాప్తు సంస్థలతో దాడులు చేయించడం బీజేపీ విధానమని దుయ్యబట్టారు. ఎన్నికల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకులను భయభ్రాంతులకు గురిచేయడమే ఆ పార్టీ లక్ష్యమని అన్నారు. సత్యం, ధర్మం, న్యాయం తమవైపే ఉన్నాయని, ఏ విచారణనైనా ధైర్యంగా ఎదుర్కొంటానని స్పష్టం చేశారు.

కవిత దీక్షకు అనుమతి నిరాకరణ

మహిళలకు 33 శాతం రిజర్వేషన్లపై శుక్రవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ కవిత నిర్వహించ తలపెట్టిన దీక్షకు పోలీసులు ముందుగా ఇచ్చిన అనుమతులను రద్దు చేశారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బిల్లు తీసుకురావాలనే డిమాండ్ తో రేపు నిరసనలు చేపట్టాలని కవిత భావించారు. అయితే వివిధ కారణాలను సాకుగా చూపుతూ అనుమతి ఇవ్వలేమని పోలీసులు చెప్పారు. కవిత ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతుండగానే పోలీసులు ఈ మేరకు సమాచారం ఇవ్వడం గమనార్హం. భద్రతా కారణాల రీత్యా కొంచెం స్థలాన్ని మాత్రమే వాడుకోవాలని, లేకుంటే వేదికను మరో చోటకు మార్చుకోవాలని సూచించారు. కాగా తాము ముందే అనుమతి తీసుకున్నామని, ఇప్పుడు ఇలా రద్దు చేయడం ఏమిటని కవిత ప్రశ్నించారు. 5 వేల మందితో సభ నిర్వహించేందుకు 10 రోజుల క్రితమే అనుమతి ఇచ్చారని తెలిపారు. అయితే బీజేపీ వాళ్లు కూడా ధర్నాకు అనుమతి కోరారని, దీంతో జంతర్ మంతర్ లోని సగం స్థలాన్ని మాత్రమే వాడుకోవాలంటూ సూచించినట్లు పోలీసులు తెలిపారు. ఇప్పటికిప్పుడు బీజేపీ వాళ్లు సభ పెట్టుకోవటం ఏంటని, ఇదంతా కావాలనే చేస్తున్నట్లు తెలుస్తోందని కవిత అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయంపై పోలీసులతో సంప్రదింపులు జరుపుతామని తెలిపారు. అయితే తమ దీక్షలో మాత్రం మార్పులేదని, యథావిధిగా నిరసన కొనసాగిస్తామని స్పష్టంచేశారు.

ఉద్యోగుల ఉద్యమబాట

(మొదటిపేజీ తరువాయి)

వీవీ మురళీ కృష్ణంనాయుడు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎస్.కృష్ణమోహన్, ప్రచార కార్యదర్శి బి.కిషోర్‌కుమార్‌తోపాటు 26 జిల్లాల జేఏసీ చైర్మన్లు, ప్రధాన కార్యదర్శులు, జేఏసీ రాష్ట్ర కమిటీ, జేఏసీ అమరావతి అనుబంధ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హాజరయ్యారు. ప్రభుత్వం ఇచ్చిన రాతపూర్వక ప్రతులపై చర్చించి, కొద్దిపాటి సవరణలతో ఉద్యమ కార్యాచరణను రూపొందించాలని సమావేశం నిర్ణయించింది. సమావేశం వివరాలను బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు వెల్లడించారు.

ప్రభుత్వం దగా: బొప్పరాజు, దామోదరరావు

ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం ఇచ్చిన లిఖిత పూర్వక ప్రతి(మినిట్స్)లో ఎలాంటి స్పష్టత లేదని, ఉద్యోగులను ప్రభుత్వం దగా చేసిందని బొప్పరాజు వెంకటేశ్వర్లు, పలిశెట్టి దామోదరరావు ధ్వజమెత్తారు. దీంతో గురువారం మధ్యాహ్నం నుంచే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో నిరసనలు ప్రారంభించినట్లు చెప్పారు. ఉద్యోగులు దాచుకున్న (జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర ప్రయోజనాలు) డబ్బులు దాదాపు రూ.3వేల కోట్లను ఈ నెలాఖరులోగా చెల్లిస్తామని, ఉద్యోగులకు చట్టబద్ధంగా రావాల్సిన దాదాపు రూ.2వేల కోట్లను సెప్టెంబర్ లోపు రెండు విడతలుగా చెల్లిస్తామని చెప్పడం మినహా మిగిలిన వాటిపై ప్రస్తావనే లేదన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి(సీఎస్)కి సమర్పించిన 50 పేజీల వినతిపత్రంలో ఆర్థికపరమైన 11వ పీఆర్సీ పే స్కేళ్లు, స్పెషల్ పేలు వెరసి రూ.5వేల కోట్లకుపైగా రావాలని వివరించారు. వాటితోపాటు పీఆర్సీ, డీఏ బకాయిలు, సీపీఎస్ ఉద్యోగుల అంశం తేలాల్సి ఉందన్నారు. ప్రతినెల ఒకటో తేదీన జీతభత్యాలు చెల్లించడం తదితర అంశాలపై స్పష్టత లేదని వివరించారు. ఆర్థికేతర అంశాలు ప్రధానంగా సీపీఎస్ రద్దు, ఔట్ సోర్సింగు ఉద్యోగులకు జీతభత్యాల పెంపుదల, కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ, గ్రామ/వార్డు సచివాలయ, ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు, వారి ప్రయోజనాలపై ప్రభుత్వం నుంచి స్పష్టత లేదన్నారు.

నేడు త్రిపురకు లెఫ్ట్ ఎంపీలు

(మొదటిపేజీ తరువాయి)

ఇంచార్జి అజయ్ కుమార్ కూడా ఈ బృందంలో ఉన్నట్లు చెప్పారు. 'త్రిపురలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ప్రకటించారు. అప్పటి నుంచి అక్కడి ప్రజల్లో భయోత్పాతం కనిపిస్తోంది. బీజేపీ హింసా రాజకీయాలు చేస్తోంది. పార్టీ ఓడిన ప్రాంతాల్లో దాడులకు తెగబడుతోంది. సీపీఎం కార్యకర్తలపైనా దాడులు జరిగాయి. ఘన విజయాన్ని ఆశించి భంగపడ్డ బీజేపీ దానిని జీర్ణించుకోలేక హింసకు పాల్పడుతోంది. ఇప్పటికే వెయ్యి మందికిపైగా ఇందువల్ల ప్రభావితం కాగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయి. తక్షణమే ఈ హింసను ఆపాలి. అందుకోసం అక్కడకు వెళ్లి ఒత్తిడి తేవాల్సిన ఉన్నందున ఎంపీల బృందం వెళుతోంది' అని ఏచూరీ చెప్పారు. త్రిపురలో హింసను యావత్ దేశం ఖండించాలని పిలుపునిచ్చారు. అవసరమైతే ఈనెల 11, 12వ తేదీ వరకు ఎంపీలు అక్కడే ఉంటారన్నారు. తిరిగి వచ్చాక నివేదికను సమర్పించడమే కాకుండా 13వ తేదీ నుంచి జరగబోయే పార్లమెంటు సమావేశాల్లోనూ ఇదే అంశాన్ని ఎంపీలు లేవనెత్తుతారని ఏచూరీ తెలిపారు. త్రిపురకు వెళ్లే ఎంపీల్లో వినయ్ విశ్వం (సీపీఐ), ఇలామరం కరీం, పీఆర్ నటరాజన్, బికాశ్ రంజన్ భట్టాచార్య, ఏఏ రహీం (సీపీఎం)తో పాటు ఇద్దరు కాంగ్రెస్ ఎంపీలు, ఓ మాజీ ఎంపీ అజయ్ కుమార్ ఉన్నారు.

రెండో ప్రాధాన్యత ఓటు

(మొదటిపేజీ తరువాయి)

పడుతున్నారన్నారు. మొత్తంగా రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని అచ్చెన్నాయుడు దుయ్యబట్టారు. ఢిల్లీలో వంద కోట్ల మద్యం కుంభకోణానికే ఎంతోమందిని అరెస్టు చేసిన కేంద్ర ప్రభుత్వం...ఇక్కడ 4వేల కోట్లరూపాయల కుంభకోణం జరిగితే ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలలో దొంగ ఓట్లతో గెలవడానికి వైసీపీ కుట్ర చేస్తోందని విమర్శించారు. పట్టభద్రుల ఎన్నికలలో మొదటి ప్రాధాన్యత ఓటు టీడీపీ అభ్యర్థులకు, రెండో ప్రాధాన్యత ఓటు పీడీఎఫ్ అభ్యర్థులకు వేయాలని టీడీపీ అధినేత చంద్రబాబు నిర్ణయించారని, దీనిని అందరూ అమలు చేయాలని అచ్చెన్నాయుడు కోరారు. టీడీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి రవీంద్ర, కర్నూలు, నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు, గౌరు వెంకటరెడ్డి, ఎమ్మెల్సీ బీటీ నాయుడు, మాజీమంత్రులు కేఈ ప్రభాకర్, ఫరూక్, ఏరాసు ప్రతాపరెడ్డి, భూమా అఖిలప్రియ, మాజీ ఎమ్మెల్యేలు బుడ్డా రాజశేఖర్‌రెడ్డి, బీవీ నాగేశ్వరరెడ్డి, సుజాతమ్మ, గౌరు చరితారెడ్డి, ఇన్‌చార్జిలు కేఈ శ్యాంబాబు, టీజీ భరత్, తిక్కారెడ్డి, మాండ్ర శివానందరెడ్డి, ధర్మారం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

కాంగోలో ఉగ్రఘాతుకం: 36 మంది మృతి

బెనీ: తూర్పు కాంగోలోని ముకోండి గ్రామంపై అర్ధరాత్రి వేళ ఉగ్రవాదులు విరుచుకుపడ్డారు. కత్తులు, కొడవళ్లతో విచక్షణారహితంగా దాడులు జరిపారు. 36 మందిని బలిగొన్నారు. మరికొందరు గ్రామ ప్రజల ఆచూకీ తెలియాల్సి ఉంది. దీంతో మృతుల సంఖ్య పెరిగే అంచనాలు ఉన్నాయి. అయితే ఉత్తర కివూ ప్రావిన్స్‌లోని బెనీ నగరానికి దక్షిణంగా 30కిమీల దూరంలో ఉన్న ముకోండి గ్రామంలో ఐఎస్ అనుబంధ సంస్థ ఉగ్రవాదులు దాడులకు తెగబడి, 36 మందిని ఊచకోత కోశారని స్థానిక అధికారులు తెలిపారు.

అరెస్ట్ చేయకుండా ఆపండి

(మొదటిపేజీ తరువాయి)

కూడా సీబీఐ ఎక్కడా వ్యతిరేకించలేదని అవినాశ్ రెడ్డి గుర్తు చేశారు. దస్తగిరి అక్కడ ఇక్కడ విని చెప్పిన మాటల ఆధారంగానే సీబీఐ విచారణ కొనసాగుతోందని, తనకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాధారాలు లేకపోయినప్పటికీ ఈ కేసులో తనను ఇరికించే ప్రయత్నం జరుగుతోందని పిటీషన్‌లో పేర్కొన్నారు. వివేకా హత్య కేసులో దర్యాప్తు అధికారి పనితీరు పక్షపాతంగా ఉందని అవినాశ్ రెడ్డి ఆరోపించారు. వివేకా హత్య ఎలా జరిగిందో ముందుగానే నిర్ణయించుకొని, అదే కోణంలో విచారణ చేస్తున్నారని ఎంపీ ఆక్షేపించారు. తప్పుడు సాక్ష్యాలు చెప్పేలా విచారణాధికారి కొందరిపై ఒత్తిడి తెస్తున్నారని, తాను విచారణలో చెప్పిన విషయాలను కూడా విచారణ అధికారి మార్చేస్తున్నారని అవినాశ్ రెడ్డి తెలిపారు. సీబీఐ అధికారులు తొలుత ఈ నెల 6వ తేదీన ఎంపీ అవినాశ్‌రెడ్డిని హైదరాబాదుకు, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డిని కడప సెంట్రల్ జైలు వద్దకు విచారణకు రావాల్సిందిగా నోటీసులు జారీ చేశారు. తండ్రీ కొడుకులను ఒకేరోజు విచారణకు పిలవడం వైసీపీలో సంచలనం రేకెత్తించింది. తనకు ముందస్తు కార్యక్రమాలు ఉండటం వలన సోమవారం విచారణకు హాజరుకాలేనని ఎంపీ సీబీఐ అధికారులకు లేఖ రూపంలో తెలియజేశారు. దీనికి ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకూ సీబీఐ నుంచి ఎలాంటి సమాచారం రాకపోవడంతో అందరిలో ఉత్కంఠ నెలకొంది. చివరకు తండ్రీ కొడుకుల విచారణ తేదీలను సీబీఐ మార్పు చేసింది. ఈ మేరకు 10న హైదరాబాదులో విచారణకు కొడుకు వైఎస్ అవినాశ్‌రెడ్డిని, 12న కడపలో తండ్రి వైఎస్ భాస్కర్‌రెడ్డిని రావాలని నోటీసులు ఇచ్చింది. అయితే 160 సీఆర్‌పీసీ కింద ఈ నోటీసులు జారీ కావడంతో అరెస్ట్ చేస్తారన్న ఆందోళనతో అవినాశ్ రెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.

విజయవాడకు గుర్తింపు తెచ్చేలా

అంబేద్కర్ స్మృతివనం

- కన్వెన్షన్ సెంటర్ నాణ్యతతో నిర్మించాలి
- సమీక్షలో సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: విజయవాడ నగరానికి గుర్తింపు తెచ్చేలా అంబేద్కర్ స్మృతివనం నిర్మాణపనులు నాణ్యతతో చేపట్టాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. విజయవాడ స్వరాజ్ మైదానంలో జరుగుతున్న అంబేద్కర్ స్మృతివనం, విగ్రహ నిర్మాణ పనులపై క్యాంపు కార్యాలయంలో గురువారం సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా అధికారులు నిర్మాణ పనుల ప్రగతిని వివరించారు. 125 అడుగుల అంబేద్కర్ విగ్రహ నిర్మాణ పనులు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. విగ్రహ విడిభాగాలు ఇప్పటికే సిద్ధంగా ఉన్నాయని, ఒక్కొక్కటిగా అమర్చుకుంటూ మొత్తం 13 దశల్లో విగ్రహ నిర్మాణాన్ని పూర్తి చేయనున్నట్లు వివరించారు. విగ్రహ నిర్మాణంలో 352 మెట్రిక్ టన్నుల ఉక్కు 112 మెట్రిక్ టన్నుల ఇత్తడిని వినియోగిస్తున్నట్లు చెప్పారు. విగ్రహం తయారీతో పాటు దాని చుట్టూ సివిల్ వర్క్స్, సుందరీకరణ, మైదానాన్ని ప్రధాన రహదారితో అనుసంధానం చేసే పనులను సీఎంకు వివరించారు. ప్రస్తుతం స్మృతివనం ప్రాంగణంలో పనులు చురుగ్గా సాగుతున్నాయని, అన్ని స్లాబ్ వర్కులు ఈ నెలాఖరునాటికి పూర్తవుతాయని, ప్రాంగణంలో ఒక కన్వెన్షన్ సెంటర్ కూడా వస్తుందని అధికారులు సీఎంకు తెలియజేశారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ అంబేద్కర్ స్మృతివనం ప్రాజెక్టు శాశ్వతమైన ప్రాజెక్టు. పనులు కూడా అంతే నాణ్యతతో ఉండాలి. స్మృతివనంలో ఏర్పాటవుతున్న కన్వెన్షన్ సెంటర్ కూడా అత్యంత ప్రధానమైనది.నిర్మాణంలో నాణ్యతతో పాటు, సుందరీకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. అధికారులు పనులను సమన్వయం చేసుకుని ముందుకు సాగాలి. పనుల పర్యవేక్షణకోసం ఏర్పాటు చేసిన ఉన్నత స్థాయి కమిటీ ఎప్పటికప్పుడు సమీక్షించుకోవాలని సీఎం అధికారులకు మార్గనిర్దేశనం చేశారు. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం (దేవాదాయశాఖ) కొట్టు సత్యనారాయణ, విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి మేరుగు నాగార్జున, పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్, సీఎస్ డాక్టర్ కె ఎస్ జవహర్ రెడ్డి, పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ స్పెషల్ సీఎస్ వై శ్రీలక్ష్మి, ప్లానింగ్ ఎక్స్ అఫిషియో సెక్రటరీ జి విజయ్ కుమార్, సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ హర్షవర్ధన్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు, ఏపీఐఐసీ వీసీ అండ్ ఎండీ జి సృజన, విజయవాడ మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతతోనే
దేశానికి ఉత్పాదకత: పురంధరేశ్వరి

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: మహిళా సాధికారతతోనే దేశానికి మరింత ఉత్పాదకత లభిస్తుందని కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురంధరేశ్వరి అన్నారు. విఐటీ-ఏపీ విశ్వవిద్యాలయంలో గురువారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పురంధరేశ్వరి మాట్లాడుతూ ఎక్కడ మహిళలకు గౌరవం లభిస్తుందో అక్కడ దేవుళ్లు సంచరిస్తారనే సామెతను గుర్తుచేశారు. వేల సంవత్సరాల క్రితం వేదకాలంలోనే మహిళలు సమానత్వాన్ని, స్వేచ్ఛను అనుభవించారని అన్నారు. స్త్రీ ఇష్టానుసారం వివాహం చేసుకోవచ్చునని, జీవిత భాగస్వామిని స్వేచ్ఛగా ఎంపిక చేసుకోవచ్చునన్నారు. కానీ కొంతమంది విదేశీ ఆక్రమణదారుల కారణంగా వారి స్వేచ్ఛ అణచి వేతకు గురైందన్నారు. స్త్రీ సమానత్వం, జీవన స్వేచ్ఛ ప్రాముఖ్యతను గ్రహించిన బీఆర్ అంబేద్కర్ భారత రాజ్యాంగంలో మహిళలకు, ప్రత్యేకించి వారి హక్కులకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. విఐటీ విశ్వవిద్యాలయంలో ప్రస్తుతం ఉన్న 32 శాతం మహిళా విద్యార్థుల సంఖ్యను రాబోయే కాలంలో 50 శాతానికి పెంచేందుకు యాజమాన్యం చొరవ తీసుకోవాలని ఆమె కోరారు. గర్భంలో ఉన్న ఆడపిల్లలను ముందుగా గుర్తించే పరీక్షల విషయంలో కఠిన చట్టాలను అమలు చేయాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. గౌరవ అతిథి వర్షా విశ్వనాథ్ కస్తూరి (వీఐటీ బీటెక్ మెకానికల్ బ్యాచ్ 2010-14 పూర్వ విద్యార్థిని, శ్రీవర్ష గ్రూప్ డైరెక్టర్) మాట్లాడుతూ తాను వీఐటీలో చదువుకున్న రోజులను గుర్తుచేసుకుంటూ, విట్ యాజమాన్యం విద్యార్థినులకు ఇచ్చే గౌరవం, ప్రాధాన్య తను కొనియాడారు. విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎస్వీ కోటా రెడ్డి మాట్లాడుతూ మహిళలకు యూనివర్సిటీ విశ్వవిద్యాలయ ప్రవేలో అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. 2017 సంవత్సరంలో విఐటీ-ఏపి విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో కేవలం 8 శాతం మహిళా విద్యార్థులతో ప్రారంభమైందని, ఇది ఇప్పుడు 32శాతంకు పెరిగిందని, త్వరలోనే ఇది 50 శాతానికి చేరుతుందని ఆశిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ అనుపమ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ కుటిల రాజకీయాలు

కత్తి నరసింహారెడ్డిని గెలిపించండి: ఓబులేసు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: వైసీపీ కుటిల రాజకీయాలను గుర్తించి ఈనెల 13న జరిగే ఉపాధ్యాయ, అధ్యాపక సంఘాల ఉమ్మడి అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని గెలిపించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు ఉపాధ్యాయులకు విజ్ఞప్తి చేశారు. వైఎస్ఆర్ జిల్లా ప్రొద్దుటూరులో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలలో అధికార పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం ముఖ్యమంత్రి మొదలుకొని మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందన్నారు. శాసనమండలిని రద్దు చేయాలని, దానికి ఒక్క రూపాయి ఖర్చు చేసినా దండగేనని చెప్పిన జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్సీ ఎన్నికలలో తన అభ్యర్థుల కోసం పరితపించడం చూస్తుంటే ఆయన అధికార దాహం అర్థవుతోందన్నారు. ఉద్యోగులు సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్నత సీపీఎస్‌ను రద్దు చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి మాటతప్పారని ఓబులేసు విమర్శించారు. గతంలో పాలక, ప్రతిపక్ష పార్టీలు ఎమ్మెల్సీ ఎన్నికలకు అంత ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఈ ఎన్నికల్లో విజయం సాధించడం ద్వారా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో తమకు తిరుగులేదని చెప్పుకోవడానికి వైసీపీ నానాతంటాలు పడుతోందని మండిపడ్డారు. జగన్ ఒక్క మంత్రి లేదా ఎమ్మెల్యే మాట వినరని, నియంతలా పాలన చేస్తున్నారని చెప్పారు. ఎమ్మెల్సీలుగా గెలిచినా వారికి అదే పరిస్థితి తప్పదన్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులను ఈ ప్రభుత్వం పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. పీఆర్‌సీ, డీఎం బకాయిల చెల్లింపుపై ప్రభుత్వ పెద్దలు తలోకమాట చెబుతున్నారని విమర్శించారు. ప్రభుత్వ విధానాల కారణంగా ఉద్యోగుల్లో అభద్రతా భావం పెరుగుతోందని చెప్పారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పట్టభద్రుల సమస్యలపై శాసనమండలిలో పోరాడే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజును గెలిపించాలని కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి బి.రామయ్య, రాష్ట్ర కార్యదర్శి పి.సుబ్బరాయుడు, పట్టణ అధ్యక్షుడు హరి, కార్యదర్శి సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు. కాగా, పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కత్తి నరసింహారెడ్డిని, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పోతుల నాగరాజులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ఓబులేసు, బి.రామయ్య పట్టణంలోని విద్యాసంస్థల్లో ప్రచారం చేశారు.

ఆగని మెడికల్ మాఫియా ఆగడాలు

- పట్టించుకోని అధికారులు
- గుజ్జుల ఈశ్వరయ్య విమర్శ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్: రాష్ట్రంలో మెడికల్ మాఫియా (ప్రైవేట్ మెడికల్ షాపులు) ఆగడాలు పెరిగిపోతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య విమర్శించారు. మెడికల్ షాపు యజమాన్యాలు ప్రజల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయని మండిపడ్డారు. మెడికల్ మాఫియా ఆగడాలను అరికట్టాల్సిన రాష్ట్ర ఔషధ నియంత్రణ మండలి (డ్రగ్ కంట్రోల్ బోర్డు) అధికారులు మామూళ్ల మత్తులో తూగుతున్నారన్నారు. ఆంధ్రప్రదేశ్ బోగస్ మెడికల్ హబ్‌గా మారిందని ఈశ్వరయ్య వ్యాఖ్యానించారు. విజయనగరంలోని దాసరి నాగభూషణరావు, అమర్ భవన్‌లో ఏఐవైఎఫ్ ఉత్తరాంధ్ర జిల్లాల ప్రాంతీయ వర్క్‌షాప్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈశ్వరయ్య మాట్లాడుతూ ప్రైవేట్ ఆసుపత్రి యాజమాన్యాలు, ప్రభుత్వ వైద్యులు, మెడికల్ షాపు యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడి నకిలీ మందులను, కాలం చెల్లిన మందులను విక్రయిస్తూ ప్రజల ఆరోగ్యంతో వ్యాపారం చేస్తున్నట్లు చెప్పారు. కొంతమంది ప్రైవేట్ వైద్యులు తాము రాసిన మందులను కొన్ని ప్రత్యేక షాపుల్లోనే కొనాలని ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. వైద్యులు, ఆసుపత్రి యాజమాన్యాలు నిబంధనలను తుంగలో తొక్కుతున్నారని మండిపడ్డారు. అవసరానికి మించి మందులు రాయడం, వైద్య పరీక్షల పేరుతో టెస్టులు రాసి దోచుకుంటున్నారని చెప్పారు. మెడికల్ షాపుల యాజమాన్యాలు బిల్లులు కూడా ఇవ్వడం లేదన్నారు. నాసిరకం మందులు, కాలం చెల్లిన మందులతో రోగులను మోసం చేస్తున్నారన్నారు. విచ్చలవిడిగా దోపిడీ జరుగుతున్నా ఔషధ నియంత్రణ మండలి అధికారులు మాత్రం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు మేల్కొని వైద్య ఆరోగ్య శాఖలో జరుగుతున్న అవకతవకలు, మెడికల్ మాఫియా ఆగడాలను అరికట్టాలని, తద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని డిమాండ్ చేశారు. మరోవైపు, తినే తిండి దగ్గర నుండి తాగే పాలు, నీరు దాకా కల్తీయేనని చెప్పారు. సోషల్ మీడియాలో అశ్లీలత పెరిగిపోయిందని, ఫేస్‌బుక్ ఓపెన్ చేస్తే బూతు పురాణాలు దర్శనమిస్తున్నాయని చెప్పారు. అశ్లీలతపై యువత పోరాడాలని, ఎస్పీలు, కలెక్టర్లకు వినతి పత్రాలు అందజేయాలని పిలుపునిచ్చారు. పరుచూరి రాజేంద్రబాబు మాట్లాడుతూ ఏప్రియల్ 26 నుండి 30 వరకు గుంటూరు వేదికగా ఏఐవైఎఫ్ రాష్ట్ర విద్య, వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులు నిర్వహిస్తామన్నారు.

కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు పి.కామేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వి.రమణ, జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం. యుగంధర్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగభూషణం, జిల్లా కార్యదర్శి కోట అప్పన్న, నాయకులు శ్రీను, రాజు, కన్నబాబు, గోపి నాయుడు, బీటీ నాయుడు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించండి

విశాలాంధ్ర-విజయనగరం: మేధావులకు బదులుగా వ్యాపారులను, సారా, ఇసుక కాంట్రాక్టర్లను చట్టసభలకు పంపాలన్న జగన్ ప్రభుత్వ విధానాలను తిప్పికొట్టాలని, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని అంతకుముందు ఈశ్వరయ్య విలేకరుల సమావేశంలో కోరారు. పీడీఎఫ్ అభ్యర్థి విజయానికి పట్టభద్రులంతా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. పాలకులు వ్యాపారులైతే ప్రజలు భిక్షగాళ్లుగా మారతారని, ప్రశ్నించే గొంతుకులను శాసనమండలికి పంపాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల గెలుపు కోసం వైసీపీ డబ్బులు వెదజల్లుతోందని విమర్శించారు. విశాఖ పెట్టుబడిదారుల సమ్మిట్‌పై స్పందిస్తూ ఆ ఎంవోయులు జగన్, పారిశ్రామికవేత్తల మధ్య జరిగినవేనని, రాష్ట్రాభివృద్ధి, నిరుద్యోగ నిర్మూలన కోసం కాదన్నారు. నాలుగేళ్లలో ఒక్క పరిశ్రమ ఏర్పాటు చేయలేదని, 20 మందికి కూడా ఉద్యోగాలిచ్చిన దాఖలాలు లేవన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర, రాష్ట్ర సహాయ కార్యదర్శులు యుగేంద్ర, ఎన్.నాగభూషణ్ పాల్గొన్నారు.



చేనేతకు ప్రత్యేక బ్రాండ్: లోకేశ్

విశాలాంధ్ర-మదనపల్లి రూరల్: తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే చేనేతపై జీఎస్టీ ఎత్తివేస్తామని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ అన్నారు. అవసరం అయితే దానికి అయ్యేసొమ్ముని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర అన్నమయ్య జిల్లా మదనపల్లి సరిహద్దు కాశీరావు పేటలో అడుగుపెట్టి మదనపల్లి దేవతనగర్ వరకు కొనసాగింది. పాదయాత్రకు టీడీపీ కార్యకర్తలు, స్థానిక ప్రజలు లోకేశ్‌కు ఘన స్వాగతం పలికారు. చేనేతలు,వాల్మీకులు, ముస్లింలతోఏర్పాటు చేసిన ముఖాముఖి కార్యక్రమంలో లోకేశ్ మాట్లాడుతూ... చేనేత కార్మికులను ఆదుకున్నది టీడీపీ ప్రభుత్వమేనని ఆయన గుర్తు చేశారు. వైసీపీ ప్రభుత్వం చేనేత కార్మికులను ఆదుకోలేకపోయిందని ఆరోపించారు. మదనపల్లి చేనేత వస్త్రాలకు ప్రత్యేక బ్రాండ్ క్రియేట్ చేస్తామన్న జగన్ మోసం చేశారని లోకేశ్ తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే చేనేతకు ఒక ప్రత్యేక బ్రాండ్ తీసుకొస్తామని హామీ ఇచ్చారు. చేనేతను మార్కెట్ లింకేజ్ ద్వారా అధిక ఆదాయం వచ్చే లా చేస్తామన్నారు. ముస్లింల అభివృద్ధి కోసం ప్రత్యేక ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేసి చిన్న కార్మికులకు ఆర్థికంగా ఉపయోగపడే విధంగా చూస్తామని అన్నారు. ఎస్టీ ఎస్సీ అట్రాసిటీ మాదిరిగా బీసీల రక్షణకు కూడా అలాంటి చట్టాన్ని తీసుకొస్తామని అన్నారు. ముస్లింల వక్ఫ్‌బోర్డ్ ఆస్తులను కాపాడే విధంగా శాశ్వతంగా చట్టం చేస్తామన్నారు. రాష్ట్రంలో ఎక్కడున్నా ఇసుక మట్టి, భూములు మాయమైపోతున్నాయని అన్నారు. పుంగనూరులో సైతం తమ ప్రభుత్వంలో ఎన్నో పరిశ్రమలకు అవకాశాలు కల్పించామని కానీ అక్కడ ఉన్న ఎమ్మెల్యే పాపాల పెద్దిరెడ్డి వాటాలడుగుతూ పరిశ్రమలు రాకుండా చేశారని ఆరోపించారు. జగన్మోహన్ రెడ్డి ఉన్న పథకాలన్నీ ఊడగొడుతున్నాడు తప్ప ప్రజలకు ఉపయోగపడింది ఏదీ తేలేదని అన్నారు. ప్రభుత్వం ఏర్పడి నాలుగు సంవత్సరాలు కావస్తున్న అభివృద్ధి శూన్యమని, పది లక్షల పదివేల కోట్లు అప్పు చేశారన్నారు. ప్రజల సమస్యల కోసం పాదయాత్ర చేస్తుంటే రోజుకొక దొంగ కేసు పెట్టి వేధిస్తున్నారని భయపడే ప్రసక్తే లేదని అన్నారు. పాదయాత్రలో మెడికల్ కళాశాల వద్ద చేరుకున్నప్పుడు నిరుద్యోగులు, టిడ్కో గృహాల వద్ద లబ్ధిదారులు, సీపీఐ నాయకులు సాంబ, కృష్ణప్ప మురళి, వినతి పత్రాలు అందజేశారు. టీడీపీ ప్రభుత్వం వచ్చిన వెంటనే టిడ్కో గృహాలు మంజూరు చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చిత్తూరు జిల్లా తెలుగుదేశం అధ్యక్షుడు పులివర్తి నాని, మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి, శ్రీరామ్ చిన్నబాబు, రాజంపేట బీసీ రాష్ట్ర అధ్యక్షుడు సురేంద్ర యాదవ్, దొమ్మలపాటి రమేష్, జయరామ్ నాయుడు, రాటకొండ బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మోదీతో ప్రజాస్వామ్యానికి ముప్పు

జేవీ సత్యనారాయణమూర్తి విమర్శ

విశాలాంధ్ర-శ్రీకాకుళం: మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తోందని, బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే ప్రజాస్వామ్యానికి భవిష్యత్తు ఉంటుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ.సత్యనారాయణ మూర్తి అన్నారు. స్థానిక ఎన్ఆర్ దాసరి క్రాంతి భవన్ (సీపీఐ కార్యాలయం)లో గురువారం సీపీఐ జిల్లా కార్యవర్గ, సమితి సమావేశాలు నిర్వహించారు. జిల్లా సమితి సభ్యుడు చాపర వెంకట రమణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేవీ.సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక మతోన్మాద దాడులు అధికమయ్యాయని, బీజేపీ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే దేశద్రోహం కేసులతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మోదీ హయాంలో ప్రజాస్వామ్య ఖూనీ అవుతోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను అదానీ, అంబానీలకు కారు చౌకగా కట్టబెడుతోందన్నారు. మోదీ పాలనలో అదానీ ప్రపంచకుబేరుడిగా అవతరించారని చెప్పారు. అదానీ కంపెనీల అవినీతిపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తుంటే కేంద్రం సమాధానం చెప్పడానికి బదులు ఎదురుదాడికి దిగుతోందని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలు, నేతలపై నిస్సిగ్గుగా కేసులు పెడుతున్న మోదీ ప్రభుత్వం...అదానీ విషయంలో ఎందుకు వెనక్కి తగ్గుతోందని నిలదీశారు. బీజేపీ పాలిత రాష్ట్రాలలో అవినీతి గురించి అసలు పట్టించుకోవడం లేదన్నారు. రాజకీయ లబ్ధి కోసం కుల, మత చిచ్చు పెడుతోందని ఆరోపించారు. బడా కార్పొరేట్ శక్తుల రుణాలు మాఫీ చేయడం కోసం సామాన్యులపై పన్నుల భారం మోపుతోందన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకాన్ని నీరుగారుస్తున్నదని, క్రమేణా నిధుల కేటాయింపు తగ్గిస్తోందని వివరించారు. నిరుద్యోగం పెరిగిపోయిందన్నారు. మహిళ గురించి గొప్పగా మాట్లాడుతున్న బీజేపీ పెద్దలు....మహిళా బిల్లును ఎందుకు ఆమోదింపచేయడం లేదని సత్యనారాయణమూర్తి ప్రశ్నించారు. మహిళపై దాడులు పెరిగాయి. గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరల పెంపుతో మహిళలను వేధిస్తున్నారని విమర్శించారు.

రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలు చేస్తున్నదని, అక్రమ కేసులతో భయపెడుతోందని సత్యనారాయణమూర్తి చెప్పారు. ఉద్యమాలను అడ్డుకోవడం ద్వారా ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తున్నదని విమర్శించారు. సకాలంలో ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదన్నారు. టిడ్కో గృహాలను లబ్ధిదారులకు ఇవ్వడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని మండిపడ్డారు. ప్రత్యేక హోదా, విభజన హామీలు సాధించడంలో విఫలమైందని, కనీసం కేంద్ర ప్రభుత్వాన్ని అడగలేని స్థితిలో జగన్ ప్రభుత్వం ఉందన్నారు. ప్రతిపక్షం సైతం వీటిని వదిలి మోదీకి సన్నిహితం కావడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమేనన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, రాష్ట్ర, దేశ భవిష్యత్ కోసం చట్టసభల్లో కమ్యూనిస్టుల ప్రాతినిధ్యం ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బలగ శ్రీరామ్మూర్తి మాట్లాడారు.

నకిలీ ఓట్లను నిలువరించండి

తిరుపతి జిల్లా కలెక్టర్‌కు సీపీఐ, సీపీఎం నేతల విజ్ఞప్తి

విశాలాంధ్ర - తిరుపతి బ్యూరో: నకిలీ ఓట్ల పేరుతో తిరుపతి నగరంలో సాగుతున్న అక్రమాలను నిలువరించేందుకు జిల్లా యంత్రాంగం పారదర్శకంగా వ్యవహరించాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డికి సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పి హరినాథ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీల జిల్లా నేతలతో కలిసి కలెక్టర్ వెంకటరమణారెడ్డికి గురువారం వారు రాతపూర్వక ఫిర్యాదును అందించారు. నగరంలోని పోలీసు అధికారులు వైసీపీ నేతలకు తొత్తులుగా మారిపోయారనీ, తప్పులను ప్రశ్నించే శక్తి వీరికి లేదని, గత అనుభవాల దృష్ట్యా తిరుపతి పోలీసులకు పోలింగ్ రోజున విధులను కేటాయించవద్దని విజ్ఞప్తి చేశారు. ఘర్షణను నివారించలేని స్థితిలో తిరుపతి పోలీసులు ఉండటమే కాకుండా అధికార పార్టీ అనుయాయులుగా వ్యవహరిస్తున్న వీరి తీరు ఇబ్బందులు కలిగిస్తాయని వివరించారు. అనేక అనుమానాలు ఉన్న నేపథ్యంలో స్థానిక పోలీసులకు పోలింగ్ నిర్వహణ బాధ్యతలు అప్పగించవద్దని జిల్లా కలెక్టర్ కు విజ్ఞప్తి చేశారు. నిజమైన ఓటర్లు నిర్భయంగా, స్వేచ్ఛగా ఓటు వేసే వాతావరణాన్ని తిరుపతిలో తీసుకురావాల న్నారు. దొంగ ఓటర్లను జైలుకు పంపుతామని, కఠినంగా వ్యవహరిస్తామని పోలింగ్ బూత్ స్థాయి అధికారులు తప్పులకు పాల్పడకుండా తగిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, ఎ.రామానాయుడు విశ్వనాథ్, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, కందారపు మురళి, జి.బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

జగన్‌కు గుణపాఠం చెప్పాలి: బుద్ధా వెంకన్న

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: మార్చి 13న జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో జగన్ సర్కారుకు గుణపాఠం చెప్పాలని ఉద్యోగులు, ఉపాధ్యాయులకు టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న పిలుపునిచ్చారు. విశాఖ జిల్లా పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ విశాఖలో జగన్ జె సమ్మిట్ నిర్వహించారని ఆరోపించారు. జగన్ విశాఖలో ఉన్నంత కాలం ఉత్తరాంధ్రవాసులకు కంటిమీద కునుకు ఉండదన్నారు. ఎక్కడ, ఎవరి భూములు దోచుకుంటారనే భయంతో నిద్ర పట్టదన్నారు. నాలుగేళ్లలో దోచుకున్న ధనాన్ని పెట్టుబడుల రూపంలోకి మార్చడానికే సమ్మిట్ పెట్టారన్నారు. సమ్మిట్‌కి వందల కోట్లు ఖర్చు చేశారని, అందులోనూ కొట్టేయడమే జగన్ లక్ష్యమన్నారు. వైఎస్ఆర్ మృతికి రిలయన్స్ కారణమని గతంలో ప్రచారం చేశారని, ఇపుడు అదే రిలయన్స్ అధినేతతో విడదీయని బంధం పెట్టుకుంటున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో జగన్‌కి గుణపాఠం చెప్పాలని పట్టభద్రులు ఎదురుచూస్తున్నారని, అందులో ముందువరుసలో టీచర్లు ఉన్నారన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలకు బెదిరింపులు మొదలుపెట్టారని, ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. గతంలో జగన్‌కు విజయవాడ బీఆర్‌టీఎస్ రోడ్డులో టీచర్లు చుక్కలు చూపించారని, ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ అదే స్ఫూర్తితో వైసీపీని ఓడించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

హామీల కోసం ఉద్యోగుల ఉద్యమాలు

సోము వీర్రాజు ఆరోపణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: హక్కుల సాధన కోసం ఉద్యోగులు ఉద్యమించాల్సిన పరిస్థితి వచ్చిందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీకి ఉద్యోగులు గట్టిబుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. విశాఖ లాసన్స్ బే కాలనీలో గల బీజేపీ కార్యాలయంలో గురువారం జరిగిన మీడియా సమావేశంలో సోము వీర్రాజు మాట్లాడారు. హామీల అమలు కోసం ఉద్యోగులు రాజకీయ పార్టీల మాదిరిగా ఉద్యమాలు చేయాల్సి రావడం గతంలో ఎప్పుడు చూడలేదని సోము వీర్రాజు అన్నారు. ఉద్యోగులను దొంగ దెబ్బ తీయాలని ప్రభుత్వం చూస్తున్నదని, ఉద్యోగుల ఉద్యమాలను అణిచివేస్తోం దన్నారు. ఉద్యోగుల పోరాటానికి బీజేపీ మద్దతుగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం ఉద్యోగులకు ప్రభుత్వం కొన్ని హామీలు ఇచ్చిందన్నారు. డిమాండ్ల విషయంలో ప్రభుత్వానికి లొంగిపోవ ద్దని ఉద్యోగులకు సూచించారు. ఉద్యోగులకు జీతాలు లేకపోయినా సలహాదారులు మాత్రం సకాలంలో జీతాలు పొందుతున్నారని గుర్తు చేశారు.

ఉల్లి రైతులను ఆదుకోండి

- ధరల స్థిరీకరణ నిధి వినియోగించాలి
- ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేయాలి
- సీఎంకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలోని ఉల్లి రైతుల సమస్యల్ని తక్షణమే పరిష్కరించి, వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు పి.రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు రైతు సంఘం నేతలు గురువారం లేఖ రాశారు. కర్నూలు, నంద్యాల, కడప, అన్నమయ్య జిల్లాలలో ఉల్లి పంట ఖరీఫ్, రబీ సీజన్ లలో విస్తారంగా పండిస్తారని, చాలా ప్రాంతాల్లో బోరు బావుల దగ్గర, మరికొన్ని ప్రాంతాల్లో వర్షాధారంగా సాగు చేస్తారని వివరించారు. ఈ ఖరీఫ్ సీజన్‌లో ఒక్క కర్నూలు జిల్లాలోనే 50వేల ఎకరాలలో పంట సాగు చేశారన్నారు. కర్నూలు, తాడేపల్లిగూడెం ఉల్లికి పెద్ద వ్యాపార కేంద్రంగా ఉందన్నారు. ఉల్లి పంట సాగుకు ఎకరాకు రూ.లక్షా 20వేల వరకు ఖర్చవుతాయని, రసాయనిక ఎరువులు, క్రిమిసంహారక మందులు, డీజీలు, పెట్రోల్ ధరలు, రవాణా ఖర్చులు విపరీతంగా పెరిగడంతో రైతులపై భారం మరింత పెరిగిందని తెలిపారు. వాతావరణంతోపాటు అన్ని రకాల పరిస్థితులు అనుకూలిస్తే ఎకరాకు 70 క్వింటాళ్ల దిగుబడి వస్తుందని, ఈ ఏడాది రాష్ట్రంలోని మార్కెట్లలో ఉల్లిని క్వింటాల్ రూ.500 ప్రకారం రైతుల నుంచి వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉల్లి ఎగుమతులపై ఆంక్షలు విధించడమూ ప్రధాన కారణమని, దీనివల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. కిలో రూ.5 ప్రకారం వచ్చే పంట ఏది దేశంలోనే లేదని, కిలో ఉల్లి రూ.30 ప్రకారం ధర ఉంటే రైతుకు కొంతవరకు ప్రయోజనం ఉంటుందని సూచించారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి ధరను పతనం చేస్తున్నారని, రైతులకు కోతకూలీ ఖర్చులు, రవాణా ఖర్చులను రానందున పండిన పంటను పొలాల్లో మేకలకు, పశువులకు వదిలేస్తున్నారని తెలిపారు. ఉల్లి రైతులు తీవ్రమైన నష్టాల్లో ఉన్నారని, కోల్‌కత్తా లాంటి దూర ప్రాంతాలకు వెళ్లి విక్రయిద్దామంటే రవాణా ఖర్చులు చాలా ఎక్కువగా ఉన్నాయన్నారు. చాలా మంది రైతులు దూర ప్రాంతాలకు అమ్మడానికి వెళ్లి సరుకును మార్కెట్లో వదిలివేసి వెనుతిరుగుతున్న ఘటనలున్నాయని వివరించారు. ఉల్లికి కనీసం మద్దతు ధర క్వింటాలుకు రూ.3వేలు నిర్ణయించాలని, మార్క్‌ఫెడ్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా ఉల్లిని కొనుగోలు చేసి రైతు బజార్లలో, హాస్టల్, చౌక డిపోలకు సరఫరా చేయాలని, 2017లో మార్క్‌ఫెడ్ వారు ఉల్లిని కొనుగోలు చేసినప్పటికీ వాటిని ఇంకా ఇవ్వలేదని, తక్షణమే ప్రభుత్వం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉల్లి పంట కొనుగోలుకు ధరల స్థిరీకరణ నిధి నుంచి రైతులను ఆదుకోవాలని, ఉల్లిపంటను ఇతర దేశాలకు ఎగుమతులు చేసేందుకు వీలుగా కేంద్రంపై రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి పెంచాలని రామచంద్రయ్య, కేవీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు.

VMRDA VISAKHAPATNAM METROPOLITAN REGION DEVELOPMENT AUTHORITY

e-AUCTION NOTICE

Rc. No.22/2022/F1/Plots Dt. 09-03-2023

The VMRDA, Visakhapatnam is proposed to sell the following plots available in various layouts of VMRDA to the public, on "as is where is basis" and applications are invited through GOAP e-auction portal : (https://konugolu.ap.gov.in) as detailed below :

For 16 Plots	Registration from 10-03-2023 to 20-03-2023	Auction date 23-03-2023

For more details visit at VMRDA website : www.vmrda.gov.in / Email : e.auctionvmrda@gmail.com / (Help desk Konugolu portal) 08645-246370/71/72/73/74, VMRDA, Contact details : 9989999479, land line No. 0891-2755554

Sd/-Metropolitan Commissioner, VMRDA

సంపాదకీయం

విశ్వ గురువుకు అప్రదిష్ట?!

వారం రోజులపాటు ఇంగ్లండ్‌లో గడిపిన కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మన దేశంలోని స్థితిగతుల గురించి, ప్రజాస్వామ్యానికి ఏర్పడుతున్న ముప్పు గురించి మాట్లాడారు. విదేశాలలో మన దుస్థితిని గురించి ప్రస్తావించినందుకు దేశ పరువు ప్రతిష్ఠలు మంటగలిసి పోయాయని బీజేపీ నానాయాగీ చేస్తోంది. మనదేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ బలహీనపడితే ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యానికి విఘాతం కలుగుతుందని రాహుల్ గాంధీ కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాలయంలో మాట్లాడుతూ అన్నారు. ఇది కేవలం ఆరోపణో, ఆయన వ్యక్తిగత అభిప్రాయమో కాదు. దేశంలో ఉన్న వాస్తవ పరిస్థితే. అయినా దీన్ని అంగీకరించడానికి సిద్ధంగాలేని బీజేపీ రాహుల్ గాంధీ దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించారని గోల పెడ్తోంది. జరుగుతున్న తప్పులను ఎత్తి చూపడం, పరిస్థితిని చక్క దిద్దడానికి ప్రయత్నించడం దేశ ప్రతిష్ఠకు భంగం కలిగించడం ఎలా అవుతుందో బీజేపీనాయకులకే తెలియాలి. ఉన్న పరిస్థితిని అంగీకరించక పోతే దిద్దుబాటుకు అవకాశం ఎక్కడ ఉంటుంది? సుభిక్షంగా ఉన్న దేశంపై రాహుల్ గాంధీ దుష్ప్రచారం చేస్తున్నారని "గోలీ మారో సాలోంకో, దేశ్ కే గద్దారాంకో" అని హుంకరించిన కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ దెప్పి పొడిచారు. ముస్లింల మీద విద్వేషం నింపడానికి ఆయన వాడిన భాష ఎంత హేయమైందో చెప్పక్కర్లేదు. మోదీ ఆయనను కేంద్రంలో మంత్రినిచేసి విద్వేష ప్రచారమే తమ విధానం అని రుజువు చేశారు. మోదీ హయాంలో జరుగుతున్న పరిణామాలను లోతుగా పరిశీలించి చూస్తేగానీ ఎవరివల్ల దేశ ప్రతిష్ఠ దెబ్బ తింటోందో అర్థం కాదు. అమెరికా నడిగడ్డ నుంచి ప్రధానమంత్రి మోదీ డోనాల్డ్ ట్రంప్ తరఫున ప్రచారంచేసిన విషయం సహజంగానే బీజేపీకి గుర్తుండదు. అంతర్జాతీయంగా తానే అగ్ర నాయకుడినని నిరూపించుకోవడానికి అష్ట కష్టాలు పడ్తున్న మోదీ తప్ప ఇతర దేశాలలో ఏ ప్రధానమంత్రీ పరాయి నాయకుడి తరఫున ప్రచారం చేయరు. చదువు సంస్కారం దండిగా ఉన్నాయనుకునే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కూడా ప్రతిపక్ష నాయకులను డెటాల్‌తో నోరు కడుక్కోవాలని అనడమూ బీజేపీ నాయకుల దృష్టిలో అప్రతిష్ఠాకరం కాదు. లండన్‌లో రాహుల్ గాంధీ మాటలు ప్రేలాపనలని బీజేపీ నాయకులు అనడం మాత్రం మర్యాదకరమైన భాషే నట. దేశ ప్రధాని కావడం తన జన్మహక్కు అని రాహుల్ గాంధీ అనుకుంటున్నారు కానీ ఆయన ఎన్నటికీ ప్రధానమంత్రి కాలేరని బీజేపీ నాయకులు శాపనార్థాలకు దిగారు. రాహుల్ ప్రధానికావడం, కాకపోవడం ఆయన లండన్‌లో చేసిన ప్రసంగాలకు సంబంధించినంత మేర విషయాంతరమే. భారత్‌లో ప్రజాస్వామ్యానికి ప్రమాదం ఉందని తనతో సహా అనేకమంది ప్రతిపక్ష నాయకుల మీద మోదీ ప్రభుత్వం పెగాసస్ సహాయంతో నిఘా పెట్టిందని రాహుల్ అన్న మాటలో అసత్యం ఏమిటో తెలియదు. ఈ వ్యవహారం సుప్రీంకోర్టులో చర్చకు వచ్చినా ఇంతకీ తాము పెగాసస్ గూఢచర్య పరిజ్ఞానాన్ని ఉపయోగించారో లేదో మోదీ సర్కారు చెప్పనేలేదు. దేశ భద్రత ముసుగులో ఈ విషయంలో నిజానిజాలు బయటపెట్టకుండా మోదీ సర్కారు తప్పించుకుంది. ప్రజాస్వామ్య వ్యవస్థ పదిలంగా ఉండడానికి కావలసిన పార్లమెంటు సవ్యంగా పని చేయడం, మీడియాకు స్వేచ్ఛ, న్యాయవ్యవస్థ నిష్పక్షపాతంగా వ్యవహరించడం, ఆలోచనలను వెల్లడించే అవకాశం లేకుండా పోతున్నాయని రాహుల్ అన్న మాటలో అవాస్తవం ఉందనడానికి విమర్శలకు దిగిన బీజేపీ నాయకులు ఒక్క రుజువూ చూపలేదు. అధికార పార్టీ విద్వేష, హింసాత్మక విధానాలు అనుసరిస్తుందనీ వారి సిద్ధాంతం పిరికితనంతో కూడిందని రాహుల్ గాంధీ అనడం సహజంగానే బీజేపీ నాయకులకు బాధాకరంగానే ఉంటుంది. సత్యం ఎప్పుడూ నిష్ఠూరంగానే కనిపిస్తుంది. "చైనా మనకన్న చాలా శక్తిమంతమైన దేశం. అలాంటి దేశంతో ఎలా కయ్యం పెట్టు కుంటాం?" అని సాక్షాత్తు విదేశాంగ మంత్రి జై శంకర్ వ్యాఖ్యానించడాన్ని పిరికితనం అనడంలో అనౌచిత్యం ఏముందో మరి!

ఘనతవహించిన ప్రధానమంత్రి మోదీ విదేశీ గడ్డ మీదే మన దేశాన్ని అనేకసార్లు అపహాస్యం చేశారు. భారతీయులుగా పుట్టినందుకు దేశ వాసులు సిగ్గు పడ్తున్నారన్నారు. షాంఘాయ్, కాలిఫోర్నియా, టొరంటో, సియోల్, అబూ దాబీలాంటి చోట్ల కూడా మోదీ ప్రతిపక్షాలను ఎద్దేవా చేశారు. ఇది అంతర్గత రాజకీయాలను ఇతర దేశాలలో ప్రస్తావించడం కాదని దబాయించడం బూటకానికి అలవాటుపడిన బీజేపీకి మాత్రమే సాధ్యం. మోదీ చేతిలో మినహాయింపులు లేని అధికార కేంద్రీకరణ, సంపద కొద్దిమంది పారిశ్రామికవేత్తల చేతిలో కేంద్రీకృతం కావడం మొదలైనవన్నీ ప్రజాస్వామ్యానికి విఘాతం కల్గించేవే అని రాహుల్ గాంధీయే చెప్పక్కర్లేదు. సవ్యంగా ఆలోచించగలిగిన వారందరూ ఈ అంశాలు గ్రహిస్తూనే ఉన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థల్లో మనం ఐదవ స్థానంలో ఉన్నామని మోదీ ఎప్పుడూ బోరవిరుచుకుని చెప్తూ ఉంటారు. కానీ 194 దేశాల తలసరి ఆదాయ సూచీలో భారత్ 144వ స్థానంలో ఉంది. ప్రపంచంలో ఆకలి సూచీలో కూడా 121 దేశాలలో భారత్ 107వ స్థానంలో ఉంది. ఈ విషయంలో పాకిస్తాన్, బంగ్లాదేశ్, నేపాల్, మైన్మార్, శ్రీలంక కూడా మనకన్నా మెరుగ్గా ఉన్నాయి. 80 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలు అందిస్తున్నా శిశువుల ఎదుగుదల విషయంలో మనం హీనస్థితిలోనే ఉన్నాం. పత్రికా స్వేచ్ఛలో మనం 142వ స్థానం నుంచి 150వ స్థానానికి దిగజారాం. 2016లో 135వ స్థానంలో ఉండేవాళ్లం. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత మీడియామీద దాడులు పెచ్చరిల్లాయి. స్త్రీ-పురుషుల మధ్య అంతరాలను పరిశీలించినా రాజకీయాలలో, విద్యాభివృద్ధిలో, ఆర్థిక స్థితి, ఆరోగ్యం విషయాల్లో భారత మహిళలు 146 దేశాల జాబితాలో 135వ స్థానంలో ఉన్నారు. అనేక రకాలుగా పేదరికంలో ఉన్నవారు దేశంలో 22 కోట్ల మంది ఉండడం సిగ్గుచేటు. సామాజిక విద్వేషాల విషయంలో పది అంకెను ప్రమాణంగా తీసుకుంటే మనం 9.4వ స్థానంలో ఉండడం అత్యంత దయనీయం.

వంద స్మార్ట్ సిటీలు అని 2015లో ఊదరగొట్టిన మోదీ ఇప్పుడు ఆ మాటే ఎత్తడం లేదు. బెంగళూర్ ఇంతకు ముందు 79వ స్థానంలో ఉంటే ఇప్పుడు 93వ స్థానానికి, ముంబై 78వ స్థానం నుంచి 90వ స్థానానికి, ఢిల్లీ 68వ స్థానం నుంచి 89వ స్థానానికి, హైదరాబాద్ 67వ స్థానం నుంచి 92వ స్థానానికి దిగజారాయి. ప్రపంచవ్యాప్తంగా ఎన్నిసార్లు ప్రభుత్వాలు అంతర్జాల సంబంధాలపై ఆంక్షలు విధించాయో అందులో సగం మోదీ సర్కారు విధించిన ఆంక్షలే కనిపిస్తాయి. చట్టబద్ధ పాలనలోనూ మనం 140 దేశాల సూచీలో 77వ స్థానంలో ఉన్నాం. ఇవన్నీ ఇలా ఉంటే సుఖసంతోషాల సూచీలో 149 దేశాలలో మనం 136వ స్థానంలో ఉండడంలో ఆశ్చర్యం ఏముందిగనక. దేశం ఎవరివల్ల అప్రదిష్ఠ పాలవుతుందో ఆలోచించలేని జడత్వం విశ్వ గురువు అనుకుంటున్న ఈ దేశవాసులకు ఉందనుకోవడం మూర్ఖత్వమే.

సుప్రీం కమిటీపైనా సంఘ్ మీడియా సందేహం!

ఎం కోటేశ్వరరావు

తప్పనిసరి పరిస్థితి ఏర్పడి తప్పు చేసినట్లు ఒక వేళ గౌతమ్ అదానీ అంగీకరించినా అతని మద్దతుదారులైన కాషాయదళాలు మాత్రం ఒప్పుకొనేట్లు కనిపించటం లేదు. అదానీ కంపెనీలు అక్రమాలకు పాల్పడుతున్నట్లు హిండెన్‌బర్గ్ సంస్థ ఇచ్చిన నివేదిక సృష్టించిన సంచలనం, ఆ కంపెనీల వాటాల విలువ పతనం గురించి తెలిసిందే. ఆ నివేదిక ఆరోపణల మీద విచారణ జరపాలని సుప్రీం కోర్టు ఆరుగురితో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. సుప్రీం మాజీ న్యాయమూర్తి ఎఎం సప్రే ఛైర్మన్‌గా ఎస్‌బిఐ మాజీ ఛైర్మన్ ఓ ప్రకాష్ భట్, ఇన్ఫోసిస్ సహ ప్రారంభకుడు నందన్ నీలేఖని, ప్రస్తుతం ఎన్‌బిఎఫ్ఐడి ఛైర్మన్‌గా, గతంలో ఐసిఐసిఐ, బ్రిక్స్ బాంకు, ఇన్ఫోసిస్ ఛైర్మన్‌గా పనిచేసిన కెవి కామత్, ప్రముఖ లాయర్ సోమశేఖర సుందరేశన్, హైకోర్టు రిటైర్డ్ జడ్జి జెపి దేవధర్ సభ్యులుగా ఉన్నారు. దాన్ని తాము స్వాగతిస్తున్నామని నిజం వెల్లడౌతుందని అదానీ ఒక ప్రకటనలో స్పందించారు. సుప్రీంకోర్టు కమిటీ తటస్థంగా వ్యవహరిస్తుందా అంటూ ఆర్‌ఎస్ఎస్ నడిపే నేషనలిస్ట్ హబ్ అనే మీడియా పోర్టల్ ప్రశ్నించింది. సభ్యులుగా ఉన్నవారికి గతంలో ఆర్థికనేరాలకు పాల్పడినవారు కొందరితో, మోదీని విమర్శించే సంస్థలతో కాంగ్రెస్‌తో సంబంధాలున్నాయని ఆరోపిస్తూ, తటస్థంగా ఉండి నివేదిక ఇస్తారా అన్న అనుమానాలను రేకెత్తించింది. దాని మీద ఇవ్వరు ఇవ్వరు అంటూ వెంటనే స్పందనలు.

దేశంలో ఇప్పుడు జరుగుతున్న తీరు తెన్నులను బట్టి జనం ప్రతిదాన్నీ అనుమానిస్తున్నపుడు ఏ కమిటీనివేసినా దానిలో ఉన్నవారిని అనుమానించటం సహజం. తానెలాంటి తప్పు చేయలేదని అదానీ తలకిందులుగా తపస్సు చేస్తున్నప్పటికీ, నరేంద్రమోదీ మద్దతుగా ఉన్నా, ఆర్‌ఎస్ఎస్ సర్టిఫికెట్ ఇచ్చినా పక్కన పెట్టేసి హిండెన్‌బర్గ్ ఇచ్చిన నివేదికను స్టాక్‌మార్కెట్లో మదుపుదార్లు నమ్మారు. తమ వాటాలను తెగ నమ్ముకొన్నారు. నెల రోజులు దాటినా జరిగిన నష్టంలో మార్పు లేదు. అడ్డగోలుగా పెంచి పెద్దచేసినా, ఇబ్బందులు వచ్చినపుడు నరేంద్రమోదీ కూడా అదానీని కాపాడలేరని కూడా స్టాక్‌మార్కెట్ మదుపుదార్లలో ఉన్నట్లు ఈ పరిణామాలు వెల్లడిస్తున్నాయి. ఇటువంటి స్థితిలో సంఘపరివార్ సంస్థ సుప్రీం కమిటీ మీద అనుమానాలను ఎందుకు రేకెత్తించినట్లు? భీమ కొరేగాంకేసులో మాదిరి దర్యాప్తుసంస్థే స్టాన్‌స్వామి, ఇతరుల కంప్యూటర్లలో తప్పుడు సమాచారాన్ని చొప్పించి దాన్నే సాక్ష్యంగా చూపేందుకు సిద్ధమైన దారుణం తెలిసిందే. అదానీ కంపెనీల్లో అలాంటి దానికి అవకాశం లేదు. వివరాలను ఇప్పటికే ధ్వంసం చేయగా మిగిలిన వాటి నుంచే అక్రమాలు పాల్పడిందీ లేనిదీ కమిటీ నిర్ధారిస్తుంది. లేదూ ఒకదానికొకటి పొంతనలేని సమాచారం ఇస్తే దాన్ని కూడా సుప్రీంకోర్టుకు అందిస్తుంది. సెబీ కూడా దర్యాప్తు జరుపుతున్నది. ఒక నియంత్రణ సంస్థగా సెబీ తీరు తెన్నుల వైఫల్యం గురించి కూడా సుప్రీం కమిటీ విచారణ జరుపుతుంది. తమ కమిటీకి సహకరించాలని సెబీని సుప్రీం ఆదేశించింది. సుప్రీం కమిటీలో వెలుగుచూడనివి సెబీ నివేదికలో లేదా సెబీలో రానివి సుప్రీం కమిటీ నివేదికలో చోటు చేసుకోవచ్చు. ఆ రెండు నివేదికలూ బహిర్గతమైన తరువాత గతంలో దర్యాప్తు జరిపిన హిండెన్‌బర్గ్ లేదా ఆ రంగంలో నిపుణులైన వారు లేవనెత్తే అంశాలను కూడా సుప్రీంకోర్టు విచారిస్తుంది. ఇంత జరగాల్సి ఉండగా ఇంకా ఆలూలేదూ చూలూ లేదు కొడుకుపేరు సోమలింగమా అన్నట్లుగా సంఘపరివార్ మీడియా ఎందుకు అనుమానాలు రేకెత్తిస్తున్నట్లు? హిండెన్‌బర్గ్ నివేదికలోని అంశాలన్నింటినీ సుప్రీంకోర్టు కమిటీ విచారించటం లేదు. మన దేశంలో తిమ్మినిబమ్మిని చేసినట్లు వచ్చిన ఆరోపణల మీదనే అది పరిశీలన జరుపుతుంది. విదేశాల్లోని డొల్లకంపెనీలు, నిధుల మళ్లింపు వంటి వాటి మీద ఏదైనా అనుమానం వచ్చే సమాచారం దొరికితే దాన్ని సుప్రీంకోర్టుకు నివేదించే అవకాశం ఉంటుంది. సుప్రీంకోర్టు విచారణ సందర్భంగా మీడియా ఎక్కువ చేసి రాస్తున్న వార్తల వలన స్టాక్‌మార్కెట్ ప్రభావితమై మదుపర్లు నష్టపోతున్నందున అదానీ-హిండెన్‌బర్గ్ వివాదం గురించి వార్తలపై నిషేధం విధించాలన్న పిటీషన్‌దారుల్లో ఒకరైన ఎంఎల్ శర్మ వినతిని సుప్రీంకోర్టు తిరస్కరించింది. సహేతుకమైన వాదనలు వినిపించండి తప్ప నిషేధాన్ని అడగవద్దని చెప్పింది.

ప్రతిపక్షాలు పార్లమెంటులో డిమాండ్‌చేసిన జెపిసికి మోదీ సర్కార్ అంగీకరించి ఉంటే సుప్రీంకోర్టు కమిటీ ఉండేదే కాదు, దాని మీద నేషనలిస్ట్ హబ్‌కు సందేహాలు లేవనెత్తే అవకాశం వచ్చి ఉండేది కాదు. జెపిసి పక్షపాతంగా పని చేసే అవకాశమే లేదు. ఎందుకంటే దానిలో అత్యధికులు అదానీని కంటికి రెప్పలా కాపాడుతున్న బిజెపి లేదా మిత్రపక్షాల సభ్యులే ఉంటారు. అయినా మోదీ ఎందుకు నిరాకరించినట్లు? ఏ పార్టీ వారు ఎందరని కాదు, ఎవరెందరున్నా అడిగిన సమాచారాన్ని కమిటీకి ఇవ్వాలి, లేకుంటే ఇవ్వలేదని సభ్యులు రాస్తారు. మెజారిటీ ఒక నివేదికను ఆమోదించినా, దానితో విబేధించేవారు కూడా మరొక నివేదికను ఇచ్చే హక్కు ఉంటుంది. ఆ రెండూ బహిరంగం చేయాల్సి ఉంటుంది. అప్పుడు ఎవరు అదానీని కాపాడేందుకు పూనుకున్నది, ఎవరు అక్రమాలను వెలికి తీసేందుకు చూసిందీ యావత్ ప్రపంచానికి తెలుస్తుంది. ఇదే మోదీని భయపెట్టి ఉంటుంది.

సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన కమిటీ సభ్యుల మీద వత్తిడి తీసుకురారా, బెదిరించరా అంటే ఈ దేశంలో ఏదైనా జరిగే అవకాశం ఉంది. అదీ ప్రభుత్వం వైపు నుంచే ఉంటుంది. మన ప్రజాస్వామ్యానికి ముంచుకు వస్తున్న ముప్పు అదే! తమ ముందు దాఖలైన కేసుల్లో సుప్రీం నోటీసులు ఇచ్చిన తరువాత గానీ కేంద్రం కదలలేదు. కమిటీ ఏర్పాటుకు అంగీకరిస్తూ తమ ప్రతిపాదనలను ఒక మూసివేసిన కవరులో పెట్టి సుప్రీంకోర్టుకు అందించింది. దాని అర్థం ఏమిటి? మేము చెప్పిన వారితో చెప్పిన పద్దతుల్లో విచారణ జరిపించాలని సుప్రీంను ప్రభుత్వం ఆదేశించటమే. పారదర్శక విచారణ జరగాలంటూ సదరు కవరును సుప్రీంకోర్టు తిరస్కరించింది. నిజానికి కేంద్రానికి అంతకంటే అవమానం మరొకటి లేదు, బహుశా ఈ పరిణామాన్ని ఊహించి ఉండరు. ఇంతకీ ఆ కవరులో నరేంద్రమోదీ సర్కార్ రాసిన అంశాలేమిటి అన్నది ఇప్పటి వరకు వెల్లడికాలేదు. ఇక అవకాశాలు లేవు. తరువాత అవి లీకైనా కేంద్రం తోసిపుచ్చే అవకాశం ఉంటుంది. మాజీ మంత్రి పి చిదంబరం అరెస్టయిపుడు బెయిలు కేసులో ఇడి సమర్పించిన సీల్డు కవర్ మీద ఆధారపడిన ఢిల్లీ హైకోర్టును 2019 లో సుప్రీంకోర్టు తప్పుపట్టింది. తమ మనస్సులను సంతృప్తిపరచుకొనేందుకు న్యాయమూర్తులకు సీల్డు కవర్‌లోని అంశాలను చూసేందుకు అధికారం ఉన్నపుడు కోర్టు విచారణలో వాటిలో కనుగొన్న వాటిని నమోదు చేయకూడదని పేర్కొన్నది. రాఫెల్ విమానాల కొనుగోల వివరాలు రహస్యం అని ప్రభుత్వం చెప్పటాన్ని కోర్టు అంగీకరించింది. 2జి స్పెక్ట్రం కేసులో కూడా అదే జరిగింది.

నయా ఇండియా పత్రికలో ఆర్‌ఎస్ఎస్‌పై శంకర్ సహారా మండిపాటు దాని మద్దతుదార్లలో గూడుకట్టుకొని ఉన్న అసహనాన్ని వెల్లడిస్తున్నది. జర్మనీ, అనేక దేశాల్లో హిట్లర్ మూకలు యూదుల పట్ల అనుసరించిన వైఖరిని మన దేశంలో ముస్లింల పట్ల ఇంకా పూర్తిగా ఎందుకు అనుసరించటం లేదన్న దుగ్ధ సంఘపరివార్ శ్రేణుల్లో పెరుగుతున్నదని శంకర్ వాదనల తీరు వెల్లడిస్తున్నది. తమ అజెండాతో ముందుకుపోతే మొదటికే మోసం వస్తుందని తలపటాయిస్తున్నారు, మత విద్వేషాన్ని ఇంకా ఎక్కిస్తే తప్ప అమలు జరపటం సాధ్యం కాదని సంఘపరివార్ భావిస్తున్నది, అందుకే ఆ కార్యక్రమాన్ని మరింతగా వేగిరపరుస్తున్నది తప్ప వైదొలగలేదు.

స్వార్థ రాజకీయాలు



రా బావ ఏమిటి దేశం నాశనమై పోతుందంటూ వస్తున్నావు. ఈ రోజు ఏదైనా మీటింగుకెళ్లావా. అదేంలేదు తెల్లారితేచాలు పేపరు మడత విప్పితే అన్ని అరాచకాలు, అన్యాయాలు. ఇప్పుడు కొత్తగా ఏమైంది. ఏం కావాలి. కుల,మత,వర్గ రాహిత్య సమాజం కావాలని, రాజ్యాంగం ప్రకారం ప్రజలకు స్వేచ్ఛకావాలని, ప్రతి వ్యక్తికి ప్రశ్నించే హక్కు కావాలని కదా మనం కోరుకునేది. అవును ఇప్పుడు కొత్తగా నీకు వచ్చిన ఇబ్బందేమిటి. పేపరులో వార్తలు చూచి కూడ అలా అడుగుతావేంటి ప్రతిపక్షంలో ఉన్న నాయకులు తప్ప అధికారంలో ఉన్న నాయకులు తప్పులు చేయరా? రాజకీయాల్లో రోజురోజుకు విలువలు పతనమై రాజుల పాలన గుర్తుకొస్తున్నాయి. నాకు తెలియక అడుగుతాను ప్రస్తుతం బీజేపీ నాయకులు మెదిలితే రామనామస్మరణ చేస్తూ రామాలయాలు నిర్మిస్తున్నారు కదా. రాముడు ఇలాగే కక్ష పూరిత పాలన చేశాడా చెప్పు. నిజమే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిపక్షం బలంగాఉండాలని తెలిసో తెలియకో ప్రభుత్వం ప్రజా వ్యతిరేక నిర్ణయాలు చేస్తే వాటిని నిలువరించి సరైన సూచనలిచ్చి ప్రజలకు అన్యాయం జరగకుండా చూడవలసిన బాధ్యత ప్రతి పక్షానిదే. కానీ ప్రస్తుతం ప్రతిపక్షాలు అలాకాకుండా అధికారంలో ఉన్న వారిని దించి తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలనే తపన తప్ప ప్రజల గురించి వారు కూడా ఆలోచించడం లేదు. ప్రభుత్వం చేసేతప్పులను ప్రజలకు వివరించి వారినివెంటబెట్టుకుని అందోళనకు దిగాలి. అది నిజమే కానీ నాయకులు వారి అనుయాయులు తప్పు చేస్తే ఆందోళనలో ప్రజలు ఉండడంలేదు. అసలు నాకు తెలియక అడుగుతాను ప్రజలకు పార్టీలు అవసరమా అని. పార్టీలు పెట్టి అందులో ప్రజలను సభ్యులుగా చేర్చి తరువాత నాయకుడు ఒకడే కనబడుతాడు. పోరాటంలో నాయకులు వారి అనుయాయులుతప్ప ఎవరికోసమో పోరాటం ఆ ప్రజలు ఉండడం లేదు. అపుడా పోరాటానికి ఎలా న్యాయం జరుగుతుంది. ఆ నాయకులను జైల్లో పెడితే పోరాటం ఆగిపోతోంది. అదే వేలమంది ప్రజలు పాల్గొంటే అందరిని బంధించడానికి పభుత్వం వెనుకడగు వేస్తుంది. అందుకే ఎవరికోసం పోరాటమో వారు ఉద్యమంలో తప్పనిసరిగా పాల్గొనాలి. అలాకాని నాడు నాయకులు పక్కదారి పడితే పోరాటం ఇంటిదారి పడుతుంది. ప్రస్తుతం ఉద్యమాలు అలా జరగడంలేదు.

అధికారంలో ఉన్నవారు వారికోసం వారి అనుయాయులకోసం చట్టాలుచేస్తూ ప్రజలు ఆస్తులు కొల్లగొడుతున్నారు. కొంతమంది బడా పారిశ్రామిక వేత్తలనుండి వార్షిక ఎన్నికలకోసం నిధులు తీసుకున్న ఫలితంగా లక్షల కోట్లు వారికి పన్ను మినహాయింపు ద్వారానో, భూములు దారాదత్తం చేయడమో ప్రభుత్వం చేస్తోంది. ఇలా చేయడం ప్రజాప్రభుత్వంలో ప్రజలకుచెప్పి చేయడం లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే మోదీ,షాలు ఇద్దరు 140కోట్ల జనాభాను రాజు,మంత్రిలాగ పాలిస్తున్నారనడంలో అతిశయోక్తిలేదు. అది సరే బావ రాష్ట్రాలపరిస్థితి కూడా అందుకు భిన్నంగా లేదుగ. అంతెందుకు మన ముఖ్యమంత్రి జగన్ కూడా వైజాగ్ స్టీలు ఫ్యాక్టరీ విషయంలో కేంద్రాన్ని గట్టిగా నిలదీయలేపోతున్నారుగ. నిజమే ఈ మధ్య కాంగ్రెసు నాయకులే అన్నారుగా సోనియాగాంధీతో విభేదించక ముందు జగన్‌పై కేసులులేవని ఆ తరువాతనే పుట్టుకొచ్చాయని. అది నిజమే కాంగ్రెసు వ్యతిరేకమైన బీజేపీ ఆ కేసులు ఎత్తివేయవచ్చుకదా. అక్కడే ఉంది అసలు విషయం. ఏకంగా 22 మంది ఎంపీల ఓట్లు వాళ్లకు అవసరం కనుక కాంగ్రెసులానే ఈ బీజేపీ కూడా గుప్పిటలో పెట్టుకుంది. కేసులు ఎత్తివేసిననాడు కేసీఆర్‌లాగా ఎదురు తిరుగు తాడేమోనని భయం వారికి లేకపోలేదు. ఆ కేసుల్లో ఇరుక్కోబట్టి స్టీలు ఫ్యాక్టరీ విషయంలో నాన్పుడుధోరణి అనుభవిస్తున్నాడు. అది సరే ఒక పక్క అప్పులు పెరిగిపోతుంటే నర్సరీ నుండి పీజీ వరకు నాణ్యమైన ఉచిత విద్య అంటాడు. స్కూళ్ల బాగుచేతలకు నాడు నేడు పథకం అంటాడు. కొత్త మెడికల్ కేలేజీలంటాడు. ఈ రకంగా గతంలో లేనివితేవడం, ప్రజాసంక్షేమ కార్యక్రమాలు చేపట్టడం మంచిదేకాని అప్పులు పెరుగుతున్న నేపథ్యంలో ఇవన్నీ సాధ్యమా లేక కేవలం ఎన్నికలు దృష్టిలో పెట్టుకుని చేసే ప్రకటనలేనా అని నా సందేహం. ఒకవేళ మధ్యలో ఆగిపోతే పెట్టిన ఖర్చు బూడిదలోపోసిన పన్నీరులా అవుతుంది కదా. ఆ మాట నిజమేగానీ ఇందులో ఒక నిగూఢమైంది ఏమంటే చేయగలిగితే నిలబడతాడు లేకపోతే కొత్త ప్రభుత్వానికి తలనొప్పిగ మారుతుంది. వచ్చినవారు చేయలేరు. ఎందరు అధికారంలోఉన్నా కేంద్రంపై ఆధారపడవలసిందే. అది సరేగానీ బావ ఈ మధ్య వైజాగ్‌సమ్మిట్ పేరిట ఏర్పాటైన సభలో ఏకంగా 13లక్షల కోట్లతో పెట్టుబడులు వస్తాయని 6లక్షల మందికి ఉచితంగా ఉద్యోగావకాశం ఉంటుందని ప్రకటనలిచ్చారు. అంతేకాక ఈ సదస్సు ద్వారా ప్రతిపక్ష ఆరోపణలకు చెక్ పెట్టినట్లయిందని వైసీపీ చెప్పుకొంటుండగా అవన్నీ జరగనివని ప్రతిపక్షం అంటోంది. అదే బావ జరగవచ్చు జరగకపోవచ్చు కానీ రాష్ట్ర శ్రేయస్సు దృష్ట్యా జరగాలని అందరూ కోరుకోవాలి.

సెల్: 9885569394

హిట్లర్, మోదీల మధ్య సారూప్యతలు



సంగిరెడ్డి హనుమంతరెడ్డి

జర్మన్ పార్లమెంటు భవనం రీచ్ స్టాగ్‌ను 27.02.1933 న దహనం చేశారు. దీనికి హిట్లర్ కమ్యూనిస్టులను నిందించారు. ఈ కాల్చివేతను కమ్యూనిస్టు వ్యతిరేక ప్రచారానికి వాడుకోవచ్చని నాజీలే రీచ్ స్టాగ్‌ను కాల్చారు. హిట్లర్ దహనసూత్రంతో ఇటలీ ఫాసిజం జర్మనీలోకి దూకింది. సోషలిస్టు శిబిర పతనంతో ప్రపంచమంతా వ్యాపించింది.

1932 నవంబర్ ఎన్నికల్లో 230 స్థానాలు వచ్చిన నాజీ పార్టీకి పార్లమెంటులో ఆధిక్యతలేదు. నేషనలిస్టులతో మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పరిచి 30.01.1933 న హిట్లర్ ఛాన్సలర్ అయ్యాడు. 31 పార్టీల మద్దతుతో వాజపేయి మన ప్రధాని అయినట్లు. 4.2.1933 న పత్రికాగోష్ఠులను, ప్రతిపక్షాలతో సమావేశాలను, ఊరేగింపులను హిట్లర్ నిషేధించాడు. మోదీకి ఇందులోనూ హిట్లరే ఆదర్శం. ఆధిక్యతా రాహిత్యాన్ని హిట్లర్ సహించలేదు. పార్లమెంటు లేకుండా ఏకఛత్రాధిపత్యం పొందాలనుకున్నాడు. ఈ నేపథ్యంలో రీచ్ స్టాగ్ కాలిపోయింది. ఇది కమ్యూనిస్టుల పనని, వారి విప్లవ ప్రణాళికలకు సంకేత మని నాజీ పత్రికలు ఘోషించాయి. అమెరికా స్వాతంత్ర్య ఫాక్స్ మూవీ న్యూస్ రీల్ కూడా హిట్లర్ కథనాన్నే ప్రతిబింబించింది. ఈ ఘటనను కమ్యూనిస్టుప్రత్యర్థుల వ్యతిరేకప్రచార సాధనంగా వాడుకున్నాడు హిట్లర్ 28.02.1933 న అధ్యక్షుడు పాల్‌వాన్ హిండెన్‌బర్గ్‌ను ఒప్పించి అత్యవసరాదేశం 'రీచ్ స్టాగ్ అగ్ని ప్రమాద చట్టం' చేయించాడు. ఇది శాసనప్రక్రియలను రద్దు చేసింది. భావప్రకటన, పత్రికా స్వేచ్ఛలు, సమావేశ హక్కు వంటి వ్యక్తి స్వేచ్ఛలను, పౌరస్వేచ్ఛలను స్తంభింపజేసింది. పోలీసుల పరిమితులను తొలగించింది. వ్యక్తిగత గోప్యతలను అతిక్రమించింది. చట్ట పరిధులను దాటి గృహనిర్బంధాలను, ఇళ్ల సోదాలను, ఆస్తుల, సంపదల జప్తులను అనుమతించింది. నేరంచెప్పకుండానే ప్రతిపక్ష నాయకులను నిర్బంధించి జైలు పాల్జేసే, రాజకీయ సంస్థలను, సాహిత్యప్రచురణలను నిషేధించే అధికారాలను పాలకులకు ఈ చట్టం కట్టబెట్టింది. (మోదీ ఉన్మాదీకరించిన ఉపా చట్టం ఇలాంటిదే) రాష్ట్ర, స్థానిక చట్టాలను అతిక్రమించే, ఆ ప్రభుత్వాలను కూలదోసే అధికారాలను కేంద్ర ప్రభుత్వానికి అందించింది. (ఇండియాలో ఇదే జరుగుతోంది) కమ్యూనిస్టు, సోషలిస్టు ప్రజాప్రతినిధులను పార్లమెంటు నుండి బహిష్కరించింది. ఈ చట్టం నాజి నియంతృత్వానికి మూలం. ప్రాథమిక హక్కులు లేని పోలీసు రాజ్యంగా మారింది జర్మని. రాజకీయ ప్రత్యర్థులను బంధించ డానికి నాజీలు నిర్బంధ శిబిరాలను స్థాపించారు.(పౌరసత్వ సవరణచట్టం అమలులో అసోంలో ఏర్పర్చిన రేపు దేశ వ్యాపితంగా స్థాపించబోయే పౌరసత్వరహిత ప్రజల తాత్కాలిక శిబిరాలు ఇలాంటివే) ఈ ఆదేశం ప్రజల, దేశ రక్షణల పేరుతో ప్రజాస్వామ్యాన్ని నియంతృత్వంగా మార్చింది. ప్రశ్నించేవారిని, ప్రభుత్వ, ప్రభుత్వాధికారుల చర్యలపై అవిధేయత తెలిపేవారిని, ప్రజలను రెచ్చగొట్టేవారిని ఒకనెల జైలుశిక్ష లేదా 150నుండి 15,000 రీచ్‌మార్కుల జరిమానాతో శిక్షించవచ్చు.

దేశాధ్యక్షుని, ప్రభుత్వాధినేతల అపహరణకు, హత్యా యత్నానికి పాల్పడేవారికి 15ఏళ్ల జైలు/జీవితఖైదు/మరణ శిక్ష విధించవచ్చు (హిట్లర్‌కు నచ్చని పనులన్నీ రెచ్చగొట్టే చర్యలే. ఆయన చంపాలనుకునే వారు అపహరించేవారు, హత్యచేసే వారు) కమ్యూనిస్టులపై హిట్లర్ ఆరోపణలు అబద్ధాలు. నిర్ణయాత్మక చర్యలతో హిట్లర్ కమ్యూనిజం నుండి దేశాన్ని రక్షించాడని అతని ప్రచార ప్రభావంతో ప్రజలు నమ్మారు. విద్య, సంస్కృతి, చట్టం, ఆర్థిక న్యాయం వగైరా వ్యవస్థలన్నీ నాజి నియంత్రణ లోకి వచ్చాయి. నేడు భారత రాజ్యాంగ, రాజ్యాంగేతర, ప్రజాస్వామ్య, ప్రజా సంక్షేమ సంస్థలన్నీ సంఘ్ నేతల ఆధీనంలో ఉన్నట్లు. హిట్లర్ ప్రచార ఉచ్చులోపడి క్రైస్తవ కాథలిక్, ప్రొటెస్టాంట్ మతగురువులు అధిక సంఖ్యలో హిట్లర్‌కు మద్దతు పలికారు.

భుజ్ భూకంపం తర్వాత గుజరాత్ ముఖ్యమంత్రి కేశుభాయ్ పటేల్ ఆరోగ్యం, ప్రజాదరణ క్షీణించాయని 2001లో బిజెపి మోదీని ముఖ్యమంత్రిగా నియమించింది. తన స్థానాన్ని పదిలపర్చుకోడానికి ఆయన పథకం రచించాడు. రీచ్‌స్టాగ్ ఘటనల తేదీలలోనే 27.02.2002న సబర్మతిరైలు ఎస్ 6, సీట్ నం. 72 ప్రయాణీకుడు గుజరాత్ గోద్రా స్టేషన్‌లో బోగీకి నిప్పుపెట్టాడు. 59 మంది అయోధ్యయాత్రికులు చనిపోయారు. బదీనికి మోదీ ముస్లింలను నిందించారు. 28.02.2002న విశ్వహిందుపరిషత్ గుజరాత్ సమ్మెకు పిలుపునిచ్చింది. మోదీ సర్కార్ అడ్డుచెప్పలేదు. ఆయన, గుజరాత్ బిజెపి అధ్యక్షుడు, జిల్లా అధికారుల సలహాలను ధిక్కరించి శవాలను గోద్రా నుండి అహ్మదాబాద్ వరకు ఊరేగించారు. సంఘ్ సభ్యులను రెచ్చగొట్టే ఉపన్యాసాలు పేల్చారు. 3నెలలపాటు జరిగిన మారణహోమంలో 3 వేలమంది ఎక్కువగా ముస్లింల ప్రాణాలు, వందల ముస్లిం మహిళల మానాలు పోయాయి. కోట్ల రూపాయల ముస్లింల ఆస్తులు బూడిదయ్యాయి. మోదీ హిందు హృదయ సామ్రాట్ అయ్యారు. ఆ ప్రభావంతో ప్రధాని అయ్యారు. దేశంలో 'రీచ్ స్టాగ్ అగ్నిప్రమాద చట్టం' అమలవుతోంది.



మంటల్లో రీచ్ స్టాగ్

జర్మనీ కమ్యూనిస్టు 24 ఏళ్ల మారినస్ వాన్‌డర్ లూబ్, రీచ్‌స్టాగ్‌ను కాల్చాడని హిట్లర్ అభియోగించాడు. రాజద్రోహ నేరంపై న్యాయమూర్తులు లూబ్‌కు మరణశిక్ష విధించారు. 10.01.1934న ఆయన తల నరికారు. అధ్యక్షుని ఆదేశానికి నెలలోపే హిట్లర్ '1933 అనుమతి చట్టం'ను ఆమోదింప జేశాడు. పార్లమెంటు, అధ్యక్షుల అనుమతి లేకుండా సొంత ఆదేశాలు జారీచేసే నిరంకుశ అధికారాలు పొందాడు. ఈ చట్టం నాజి పార్టీని ఏకైక రాజకీయ పార్టీగా ప్రకటించింది. హిట్లర్ మిడిసిపాటు మింటికి ఎగిసింది. ప్రభుత్వ యంత్రాగంలో పనిచేసేవారందరినీ నాజి పార్టీ సభ్యులుగా నిర్బంధించింది. నాజి పార్టీ దేశంలో ప్రజల జీవితాల్లో ప్రతి రంగాన్ని నియంత్రించింది. 1933లో హిట్లర్ అధికారానికి వచ్చినపుడు 4,700 జర్మన్ పత్రికల్లో నాజీల వాటా 3 శాతమే. ప్రతిపక్షాలను రద్దుచేసి ఆ పార్టీల, కమ్యూనిస్టుల, సోషలిస్టుల పత్రికలను నాజీలు సొంతం చేసుకున్నారు. నాజీ సైనికదళం ప్రత్యర్థులను బంధించింది. నిర్బంధకేంద్రాలు, సమీకరణ శిబిరాల్లో కుక్కింది. నాజీ దుండగులు ప్రతిపక్షాల కార్యాలయాలను, ప్రచురణాలయాలను ఆక్రమించారు. కొన్ని పత్రికలను బలవంతంగా కొన్నారు. మిగిలిన స్వతంత్ర పత్రికలు హిట్లర్‌కు అనుకూలంగా మారాయి. 04.10.1933 సంపాదకుల చట్టం ద్వారా సంపాదకులను, పాత్రికేయులను జాతి శుద్ధిచేశారు. యూదులు, ఆర్యేతరులు దేశం విడిచిపోయారు. ప్రభుత్వాన్ని "బలహీనపరిచే" దేశవిదేశీ అంశాలను పత్రికలు ప్రచురించరాదు. ఈ నియమాలను ఉల్లంఘించిన పాత్రికేయుల ప్రాణాలు పోయాయి. మన పత్రికారంగం నేడు ఈ స్థితిలోనే ఉంది.

అధ్యక్షుడు పాల్ వాన్ హిండెన్‌బర్గ్ మరణం తర్వాత ఆగస్టు 1934లో హిట్లర్ దేశాధ్యక్షుడు, ప్రభుత్వాధినేత, నాజి పార్టీ నాయకుడు అయ్యాడు. (రాజ్యాంగ సవరణతో మోదీకి దఖలుపడబోయే పదవులివే) సైన్యం హిట్లర్‌కు అతి విధేయతను ప్రకటించింది. (నేటి మన సైన్యాధిపతుల లాగా) హిట్లర్ నియంతృత్వ నిర్వహణలో స్త్రీలు కీలకపాత్ర పోషించారు. శుద్ధజాతి సూత్రంలో అపరిమిత ఆర్య శిశువులను కనడానికి హిట్లర్ జనాభా విధానం స్త్రీలను ప్రోత్సహించింది. (సంఘ్ మగాళ్ళు హిందుస్త్రీలను ఇలాగే ఆదేశిస్తున్నారు) యూదులను, ఆటవికులను అశుద్ధజాతీయులుగా ప్రకటించారు. నిర్మూలించారు. (సంఘ్ ముస్లింలను, క్రైస్తవులను విదేశీయులుగా ప్రకటించింది. వేధిస్తోంది.) నాజి పార్టీ రాజ్య రహస్య పోలీసులు (గెస్టపొ), భద్రతాదళ సేవకులు హిట్లర్ విమర్శకులను చంపారు. బజరంగ్ దళ్, ధర్మ, రామ, హనుమాన్ సేనలు, గోరక్షణ వగైరా సంఘ్ సంస్థలు ఈ పనులే చేస్తున్నాయి.

ఆల్ ఇండియా ప్రోగ్రెసివ్ ఫోరం జాతీయకార్యదర్శి,
9490 20 4545

మహిళా జడ్జికీ తప్పని వేధింపులు

- ఫొటోలు మార్ఫింగ్ చేసి పరువు తీస్తానంటూ బెదిరింపు
- రూ.20లక్షల డిమాండ్ - రాజస్థాన్‌లో ఘటన
- నిందితుడి కోసం గాలిస్తున్న పోలీసులు

జైపూర్: సమాజం ఎంత ముందుకు సాగుతున్నా... మహిళలు ఎంత పురోగతిని సాధిస్తున్నా వేధింపులు మాత్రం వారిని ఏదో రకంగా వెంటాడుతూనే ఉన్నాయి. ఓ మహిళా న్యాయమూర్తికి సైతం వేధింపులు తప్పలేదు. ఫొటోలు మార్ఫింగ్ చేసి రూ.20లక్షలు ఇవ్వాలని మహిళా జడ్జిని ఓ వ్యక్తి బ్లాక్‌మెయిల్ చేశాడు. డబ్బు ఇవ్వకపోతే మార్ఫింగ్ చేసిన ఫొటోలను అందరికీ సరఫరా చేస్తానని బెదిరించాడు. సామాజిక మాధ్యమాల్లోని ఆమె ఖాతాల నుంచి ఫొటోలు తస్కరించి, వాటిని మార్ఫింగ్ చేసి జైపూర్‌లోని కోర్టు చాంబర్లకు, జడ్జి ఇంటికి చేరవేశాడు. నిందితుడిని గుర్తించిన పోలీసులు అతని కోసం గాలిస్తున్నారు. ఈ వ్యవహారంలో ఫిబ్రవరి 28న కేసు నమోదు కాగా ఇప్పటివరకు ఎవరిని అరెస్టు చేయలేదని పోలీసులు తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీన మహిళా న్యాయమూర్తి ఫిర్యాదు ఆధారంగా ఎఫ్ఐఆర్ నమోదైందన్నారు. పిల్లల స్కూల్ నుంచి వచ్చినట్లుగా చెప్పి ఓ పార్శిల్‌ను తన స్టెనోగ్రాఫర్‌కు ఓ వ్యక్తి అందజేశాడని, పేరు అడిగే లోపే అతను అక్కడ నుంచి వెళ్లిపోయాడని, పార్శిల్‌లో కొన్ని మిఠాయిలు, మార్ఫింగ్ చేసిన ఫొటోలు, బెదిరింపు లేఖ ఉన్నట్లు జడ్జి తన ఫిర్యాదులో పేర్కొన్నారు. 'రూ.20లక్షలు సిద్ధంగా పెట్టుకోండి లేదంటే మీ పరువుతో పాటు మీ కుటుంబ పరువును మంటగలుపుతా.. డబ్బును ఏ సమయంలో ఎక్కడి చేర్చాలో త్వరలోనే తెలియజేస్తా' అని లేఖలో ఉన్నట్లు ఎఫ్ఐఆర్ పేర్కొంది. మరొక పార్శిల్‌ను 20 రోజుల తర్వాత జడ్జి ఇంటికి రావడంతో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడు 20ఏళ్ల వాడని, పార్శిళ్లను అందజేసే క్రమంలో చాంబర్ల వద్ద సీసీటీవీ కెమెరా ఫుటేజి దొరికిందని, దాని ఆధారంగా అతని కోసం గాలిస్తున్నామన్నారు.

స్వర్ణాలయాన్ని సందర్శించిన రాష్ట్రపతి

అమృత్‌సర్: పంజాబ్, అమృత్‌సర్ పర్యటనలో భాగంగా రాష్ట్రపతి ముర్ము గురువారం స్వర్ణాలయాన్ని సందర్శించుకున్నారు. గట్టిభద్రత నడుమ రాష్ట్రపతి ఒక రోజు పర్యటన సాగింది. ఆమెతో పాటు పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్, శిరోమణి గురుద్వారా పర్బంధక్ కమిటీ (ఎస్‌జీపీసీ) అధ్యక్షుడు హర్జిందర్ సింగ్ ధామి ఉన్నారు. స్వర్ణాలయంలో కీర్తనను ఆలకించిన ముర్ము అక్కడి కారా ప్రసాదాన్ని తీసుకున్నారు. లంగర్ హాల్, వంటపాత్రలు శుభ్రం చేసే స్థలాన్ని పర్యవేక్షించారు. స్వర్ణాలయ సమాచార కేంద్రానికీ వెళ్లారు. అక్కడ ఆమెను 'రోబ్ ఆఫ్ ఆనర్'తో సత్కరించారు. సిక్కు మత పుస్తకాలు, స్వర్ణాలయ ప్రతిమ, ఉన్ని శాలువను రాష్ట్రపతికి సమాచార కేంద్ర ప్రతినిధులు బహూకరించారు. ఆపై జలియన్‌వాలా బాగ్, దుర్గినా ఆలయం, భగవాన్ వాల్మీకి రామ్ తీరథ్ స్థల్‌నూ షెడ్యూల్ ప్రకారం ముర్ము సందర్శించారు. రాష్ట్రపతిగా ఇది ఆమె తొలి పర్యటన కాగా స్వర్ణాలయం వద్ద సిక్కుల మతసంస్థ ఎస్‌జీపీసీ ప్రతినిధులు రెండు వినతిపత్రాలను ముర్ముకు అందజేశారు. ఒక దానిలో సిక్కు రాజకీయ ఖైదీల విడుదలను కోరారు. కొందరు సిక్కు ఖైదీలు శిక్షా కాలం ముగిసినప్పటికీ కారాగారాల్లోనే మగ్గుతున్నారని రాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లినట్లు ఎస్‌జీపీసీ ప్రధాన కార్యదర్శి గురుచరణ్ సింగ్ గ్రేవల్ తెలిపారు. మరొక వినతిపత్రంలో హరియాణాలోని గురుద్వారాల నిర్వహణ వ్యవహారాలను చూసేందుకు హరియాణా సిక్కు గురుద్వారా పరబంధక్ కమిటీని విడిగా ఏర్పాటు చేయాలని కోరామన్నారు. మధ్యాహ్నం విమానాశ్రయానికి చేరుకున్న రాష్ట్రపతికి రాష్ట్ర గవర్నర్ బన్వరిలాల్ పురోహిత్, ముఖ్యమంత్రి మాన్, కేంద్రమంత్రి సోమ్ ప్రకాశ్, కాంగ్రెస్ ఎంపీ గుర్జీత్ సింగ్ స్వాగతం పలికారు.

మీ ఆయన బతికే ఉన్నాడుగా!

మహిళతో బీజేపీ ఎంపీ అనుచిత వ్యాఖ్యలు

బెంగళూరు: మహిళా దినోత్సవం రోజే బీజేపీ ఎంపీ ఒక మహిళపై నోరు పారేసుకున్నాడు. మహిళపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ విమర్శలపాలయ్యాడు. బీజేపీ ఎంపీ మునిస్వామి ఓ మహిళను బొట్టు ఎందుకు పెట్టుకోలేదని ప్రశ్నిస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కర్ణాటకలోని కోలార్ జిల్లాలో షాపింగ్ మార్కెట్‌ను మునిస్వామి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా అక్కడున్న స్టాల్‌లో మహిళను ఉద్దేశించి నువ్వు బొట్టు ఎందుకు పెట్టుకోలేదు..ఇక్కడ షాప్ పెట్టుకునేందుకు నీకు ఎవరు అనుమతించారు..నీ భర్త ఇప్పుడు బతికే ఉన్నాడుగా...అయినా బొట్టు ఎందుకు పెట్టుకోవు...నీకు కామన్‌సెన్స్ లేదా అంటూ నోరుపారేసుకున్నారు. మహిళపై మునిస్వామి నోటిదురుసు వ్యాఖ్యలపై సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తాయి. మహిళపై బీజేపీ ఎంపీ అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తంచేశారు. మహిళలపై బీజేపీ నేతలు మోరల్ పోలీసింగ్ చేస్తున్నారని కాంగ్రెస్ నేత కార్తీ చిదంబరం ట్వీట్ చేశారు. భారత్‌ను హిందుత్వ ఇరాన్‌లా మార్చాలని బీజేపీ చూస్తోందని విమర్శించారు.

మరో ఇద్దరు మంత్రివర్గంలోకి

అతిషి, సౌరవ్ ప్రమాణం

న్యూఢిల్లీ: ఢిల్లీలోని కేజ్రీవాల్ మంత్రివర్గంలో మరో ఇద్దరు చేరారు. ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)కి చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు సౌరవ్ భరద్వాజ్, అతిషితో లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ప్రమాణం చేయించారు. ఆ తర్వాత ఇద్దరికి శాఖలను సైతం కేటాయించారు. అతిషికి విద్యాశాఖ, ప్రజాపనులు, పర్యాటక శాఖ బాధ్యతలను అప్పగించారు. సౌరవ్ భరద్వాజ్‌కు ఆరోగ్యం, పరిశ్రమలశాఖలను కేటాయించారు. సౌరవ్ భరద్వాజ్ గ్రేటర్ కైలాశ్ నుంచి వరుసగా మూడోసారి ఎమ్మెల్యే అయ్యారు. ఇంతకు ముందు కేజ్రీవాల్ ప్రభుత్వంలోనూ ఆయన తొలిసారి మంత్రిగా పని చేశారు.అన్నా హజారే ఉద్యమంలోనూ పాల్గొన్నారు.

మోదీ సర్కారును నిలదీస్తాం

తృణమూల్ నేత ఓబ్రెయిన్

న్యూఢిల్లీ: ఎల్ఐసీ, ఎస్‌బీఐ కష్టాలు, నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, నిరుద్యోగం, కేంద్ర సంస్థల దుర్వినియోగం వంటి అంశాలను పార్లమెంటులో లేవనెత్తుతామని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ స్పష్టంచేసింది. మోదీ ప్రభుత్వ విధానాల కారణంగా ఎల్ఐసీ, ఎస్‌బీఐ ఇబ్బందులో పడ్డాయని రాజ్యసభలో తృణమూల్ నేత డెరెక్ ఓబ్రెయిన్ చెప్పారు. పార్లమెంటులో అనుసరించాల్సిన వ్యూహంపై పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి, తృణమూల్ అధినేత్రి, పార్టీ ప్రధాన కార్యదర్శి అభిషేక్ బెనర్జీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారని ఒబ్రెయిన్ చెప్పారు. సుదీప్ బందోపాధ్యాయ లోక్‌సభలో తృణమూల్ నేతగా ఉన్నారు. బీజేపీ యేతర రాష్ట్ర ప్రభుత్వాలపై కొనసాగుతున్న కక్షసాధింపు చర్యలను ప్రత్యేకంగా ప్రస్తావిస్తామని ఆయన స్పష్టంచేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి కొన్ని పథకాల నిధులు నిలిపివేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని పార్లమెంటులో ఎండగడతామని చెప్పారు. రెండో విడత పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభానికి ముందు ఇతర ప్రతిపక్ష పార్టీలతో సంప్రదింపులు జరుపుతామని ఓబ్రెయిన్ చెప్పారు. అదానీ గ్రూప్‌లో ఎల్ఐసీ, ఎస్‌బీఐ పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టాయని, దీనివల్ల అవి తీవ్రంగా నష్టపోయాయని ఒబ్రెయిన్ విమర్శించారు. ఇదే విషయంపై మొదటి విడత సమావేశాల్లో ప్రతిపక్షాలన్నీ మోదీ సర్కారును నిలదీశాయని, పార్లమెంటును స్తంభింపచేశాయని గుర్తుచేశారు. అదానీ గ్రూపుకు సంబంధించిన ఆరోపణలపై పార్లమెంటు సంయుక్త కమిటీ(జేపీసీ) కోసం కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. సమాజ్‌వాదీ, వామపక్షాలు, డీఎంకే వంటి ఇతర ప్రతిపక్షాలు సైతం ఇదే అంశంపై కేంద్రాన్ని నిలదీస్తున్నాయి. సమాఖ్య స్ఫూర్తికి తూట్లు పొడవడం, కేంద్ర దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడంపై ఆగ్రహంతో ఉన్నాయి.

బీజేపీ ఉత్తరాది నేతల తప్పుడు ప్రచారం

స్టాలిన్ ఆందోళన

చెన్నై: ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన బీజేపీ నేతలు నకిలీ వార్తలు వ్యాప్తి చేస్తున్నారని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆందోళన వ్యక్తంచేశారు. తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా 'రాజకీయ ప్రేరేపిత కుట్ర' జరుగుతోందని ఆయన మండిపడ్డారు. బీహార్‌కు చెందిన వలస కార్మికులపై దాడి జరిగినట్లుగా కొన్ని వీడియో క్లిప్‌లు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ దీనిపై గురువారం స్పందించారు. దేశం అంతటా ఉన్న ప్రజలకు తమ రాష్ట్రం నిలయమని తెలిపారు. 'తమిళులు సోదరభావాన్ని ప్రేమిస్తారు. ఇక్కడి ఉత్తరాది రాష్ట్ర సోదరులకు ఇది బాగా తెలుసు' అన ఆయన అన్నారు. కొంతమంది వ్యక్తులు నకిలీ వీడియోలు సృష్టించి తప్పుడు వార్తలు వ్యాప్తి చేశారని విమర్శించారు. 'ఉత్తర భారత రాష్ట్రాలకు చెందిన బీజేపీ సభ్యులు దురుద్దేశంతో ఇలా చేశారు. బీజేపీకి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఐక్య కూటమి అవసరమని నేను మాట్లాడిన మరుసటి రోజే ఇలా జరిగింది. దీనిని గమనిస్తే ఆ కుట్ర మీకు అర్థమవుతుంది' అని అన్నారు. బీహార్ వలస కార్మికులపై దాడికి సంబంధించిన నకిలీ వీడియోలపై డీజీపీతో దర్యాప్తు చేయించినట్లు స్టాలిన్ తెలిపారు. తమిళనాడులో అలాంటి ఘటనలు జరుగలేదన్నారు. బీహార్ సీఎం నితీశ్ కుమార్‌తో కూడా ఈ అంశంపై తాను మాట్లాడినట్లు చెప్పారు. బీహార్ ప్రతినిధులు కూడా తమిళనాడును సందర్శించి పూర్తి సంతృప్తితో తిరిగి వెళ్లినట్లు చెప్పారు. మరోవైపు తమిళనాడులో వలస కార్మికులు నివాసం ఉండే ప్రాంతాలను స్టాలిన్ మంగళవారం సందర్శించారు. ఇతర రాష్ట్రాలకు చెందిన నివాసితుల భద్రతకు భరోసా ఇచ్చారు. డీఎంకే ఎంపీ టీఆర్ బాలు కూడా సీఎం నితీశ్ కుమార్‌ను పాట్నాలో కలిశారు. బీహార్‌కు చెందిన వలస కార్మికులకు భద్రత కల్పిస్తామని తెలిపారు. సీఎం స్టాలిన్ కూడా నితీష్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడారు.

టికెట్ల పంపిణీపై చర్చిస్తున్నాం

170 సీట్లపై ఏకాభిప్రాయం: శివకుమార్ వెల్లడి

బెంగళూరు: టికెట్ల పంపిణీపై స్క్రీనింగ్ కమిటీ చర్చిస్తున్నదని, ఇప్పటి వరకు 170 సీట్లపై చర్చ పూర్తయిందని, ఈ సీట్లపై ఏకాభిప్రాయం వచ్చిందని కాంగ్రెస్ పార్టీ కర్ణాటక రాష్ట్ర అధ్యక్షుడు డీకే శివకుమార్ గురువారం చెప్పారు. టికెట్ల పంపిణీలో గెలుపు అవకాశాలు, సామాజిక న్యాయం, పార్టీ పట్ల నిబద్ధతను ప్రామాణికాలుగా తీసుకుంటున్నట్లు స్పష్టంచేశారు. చాలా నియోజకవర్గాల్లో పోటీ ఎక్కువగా ఉందని, అభ్యర్థులపై ఏకాభిప్రాయం కోసం ప్రయత్నిస్తున్నామని చెప్పారు. 224 సీట్లు గల కర్ణాటక అసెంబ్లీకి మేలో ఎన్నికలు జరుగుతాయి. '170 సీట్లపై చర్చించాం. 50 సీట్లకు పోటీ ఎక్కువగా ఉంది. వీటిపై చర్చించి కేంద్ర ఎన్నికల కమిటీకి మా అభిప్రాయం చెబుతాం. ఇందులో ఏకాభిప్రాయం కుదిరితే ఎలాంటి గందరగోళం ఉండదు. టికెట్ల పంపిణీ సజావుగా జరుగుతుంది' అని శివకుమార్ చెప్పారు. టికెట్ల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో సంప్రదింపులకు ప్రయత్నిస్తున్నామని ఆయన విలేకరుల సమావేశంలో చెప్పారు. టికెట్ల విషయంలో పోటీ, భిన్నాభిప్రాయాలు గల 50-60 నియోజకవర్గాల నాయకులతో శుక్రవారం నుంచి సంప్రదింపులు జరుపుతామని, చిక్కమగళూరు నుంచి ప్రారంభిస్తానని శివకుమార్ తెలిపారు. టికెట్ల కోసం ఎవరు పోటీ పడినా అంతిమంగా కాంగ్రెస్ పార్టీ విజయాన్ని నాయకులు కోరుకుంటున్నారన్నారు. బీజేపీని ఓడించడం, కాంగ్రెస్ అధికారం చేపట్టడం...ఇదే నినాదమని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మోహన్ ప్రకాశ్ నాయకత్వంలోని స్క్రీనింగ్ కమిటీలో నీరజ్ డాంగి, మహ్మద్ జావెద్, సప్తగిరి ఉలకా సభ్యులుగా ఉన్నారు. శివకుమార్, సీఎల్పీ నేత సిద్ధరామయ్య, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి రణదీప్ సింగ్ సూర్జేవాలా, శాసనమండలిలో ప్రతిపక్షనేత బీకే హరిప్రసాద్, కేపీసీసీ ప్రచార కమిటీ అధ్యక్షుడు ఎంబీ పాటిల్, మేనిఫెస్టో కమిటీ చైర్మన్ జి.పరమేశ్వర తదితరులు ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉన్నారు. గెలుపు గుర్రాలకే పార్టీ అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఓ ప్రశ్నకు శివకుమార్ సమాధానమిచ్చారు. దీనిని దృష్టిలో పెట్టుకొని అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, వీటితోపాటు సామాజిక న్యాయం, పార్టీ పట్ల నిబద్ధతను దృష్టిలో ఉంచుకుంటున్నామన్నారు. సంపూర్ణ మెజారిటీతో కర్ణాటకలో అధికారంలోకి రావడమే కాంగ్రెస్ లక్ష్యమని శివకుమార్ స్పష్టంచేశారు. కాంగ్రెస్‌కు 140 సీట్లు వస్తాయని ఇటీవల వెలువడిన సర్వేలను ఆయన ఉటంకించారు.

జమ్మూలో ఉద్యోగార్థుల నిరసన...అరెస్టు

జమ్ము: జమ్ముకశ్మీర్ సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్ (జేకేఎస్ఎస్‌బీ)... గతంలో బ్లాక్ లిస్ట్‌లో ఉన్న కంపెనీకి కంప్యూటర్ ఆధారిత రాత పరీక్ష నిర్వహించే బాధ్యతను కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తూ జమ్మూలో వరుసగా రెండోరోజు ఆందోళనలు జరిగాయి. గురువారం నాడిక్కడ నిరసన ప్రదర్శన నిర్వహించిన తర్వాత పోలీసులు అనేక మంది ఉద్యోగార్థులను అదుపులోకి తీసుకున్నారు. జేకేఎస్ఎస్‌బీ న్యాయబద్ధంగా ఉద్యోగ నియామక ప్రక్రియ చేపడతామని హామీ ఇచ్చినప్పటికీ పెద్ద ఎత్తున నిరసనకారులు రోడ్లపైకి వచ్చారు. కేంద్రపాలిత ప్రాంతంలో ప్రభుత్వ పోస్టులను భర్తీ చేయడానికి వివిధ పరీక్షా కేంద్రాలలో మార్చి 16 నుంచి ఏప్రిల్ 5 వరకు బోర్డు రాత పరీక్షలను షెడ్యూల్ చేసింది. అయితే 2019లో బ్లాక్‌లిస్ట్‌లో ఉన్న ఆప్టెక్ లిమిటెడ్ కంపెనీకి ఈ బాధ్యతల్ని అప్పగించడానికి వ్యతిరేకంగా పనామా చౌక్‌లో ఉద్యోగార్థులు సమావేశమై నినాదాలు చేశారు. వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బలవంతంగా వారిని రెండు బస్సుల్లో ఎక్కించి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. 'మా భవిష్యత్తు భరోసా కోసం శాంతియుత నిరసనను నిర్వహించడానికి కూడా మాకు అనుమతి లేదు' అని ఒక నిరసనకారుడు తెలిపారు. పీడీపీ అధ్యక్షురాలు, మాజీ ముఖ్యమంత్రి మెహబూబా ముఫ్తీ ఉద్యోగార్థులపై పోలీసు బలగాలను ప్రయోగించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. జమ్ముకశ్మీర్‌లో అవినీతి ఎంత లోతుగా వేళ్లూనుకుపోయిందో ఈ చర్య తెలియజేస్తోందని అన్నారు.

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన...1100మందిపై జరిమానా

నోయిడా: హోలీ సందర్భంగా నోయిడా, గ్రేటర్ నోయిడా అంతటా వివిధ రహదారి భద్రతా నిబంధనలను ఉల్లంఘించిన 1100 పైగా వాహన (కార్లు, ద్విచక్రవాహనాలు) యజమానులపై పోలీసులు జరిమానా విధించారు. దాదాపు 30 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిలో తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐదు వాహనాల యజమానులకు రూ. 17,000 నుండి రూ. 33,000 వరకు జరిమానా విధించారని డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలను తనిఖీ చేయడానికి ఇన్‌స్పెక్టర్లు, సబ్-ఇన్‌స్పెక్టర్లు , కానిస్టేబుళ్లతో సహా 475 మంది ట్రాఫిక్ పోలీసు సిబ్బంది గౌతం బుద్ధ నగర్ అంతటా విధుల్లో ఉన్నారని ఆయన పేర్కొన్నారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనం నడిపిన వారిపై 650, ట్రిపుల్ రైడింగ్-265, మద్యం సేవించి వాహనాలు నడిపినందుకు 75 చలాన్లు జారీ చేశామని, కారు కిటికీలకు బ్లాక్ ఫిల్మ్‌లు వేసినందుకు 25మంది యజమానులకు, పత్రాలు సమర్పించని మరో 25మంది వాహన యజమానులకు జరిమానా విధించినట్లు వివరించారు.

అది రూ.500 కోట్ల కుంభకోణం

పత్రికలకు ప్రకటనలపై అజిత్ పవార్ విమర్శ

ముంబై: దేవేంద్ర ఫడ్నవిస్ ప్రభుత్వ హయాంలో సమాచార, ప్రచార శాఖలో రూ.500 కోట్ల కుంభకోణం జరిగినట్లు మహారాష్ట్ర అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అజిత్ పవార్ గురువారం విమర్శించారు. ముఖ్యమంత్రి అనుమతి లేకుండా 2019లో పత్రికల్లో ప్రకటనలకుగాను రూ.500 కోట్లకు పైగా ప్రభుత్వ అధికారులు ఆమోదం తెలిపినట్లు చెబుతున్నారని, అందువల్ల ఈ కుంభకోణంతో సంబంధం గల అధికారులను శిక్షించాలని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే డిమాండ్ చేశారు. ప్రసార, ప్రచారమంత్రిత్వశాఖ ముఖ్యమంత్రి అధీనంలోనే ఉంటుంది. 2014-19 కాలంలో బీజేపీ-శివసేన ప్రభుత్వం ఉంది. 2019-20 నాటి వాణిజ్య ప్రకటన బిల్లులు నిలిచిపోయాయని, వాటిని ఇప్పటి వరకు చెల్లించలేదని పవార్ చెప్పారు. ఇప్పటి ప్రభుత్వం ఆ బిల్లులు చెల్లించడానికి ఆదేశాలు జారీ చేసిందని, ఇది తీవ్రమైన చర్య అని, ఇలాంటి కార్యకలాపాలకు ప్రభుత్వం మద్దతివ్వరాదని పవార్ చెప్పారు. దీనికి సంబంధించిన అధికారులను సస్పెండ్ చేయాలని, పత్రికలకు ప్రకటనలు జారీ చేయడానికి ముఖ్యమంత్రి ఆమోదం తప్పనిసరని పవార్ స్పష్టంచేశారు. ఇప్పుడు ఈ కేసులో ముఖ్యమంత్రి అనుమతి లేకుండానే రూ.500 కోట్లకు పైగా ప్రకటనలకు ఆమోదం తెలిపారని విమర్శించారు.

రిటైల్ రుణాల్లో మహిళలదే అగ్రస్థానం

2022లో 25 శాతం పెరుగుదల

న్యూఢిల్లీ : దేశంలో రిటైల్ రుణాలను పొందుతున్న వారిలో మహిళలే అగ్రస్థానంలో ఉన్నారు. ఇవి డిసెంబరు 2022 నాటికి 25 శాతం పెరిగి రూ.26 లక్షల కోట్లకు చేరుకున్నాయి. ఇది ఏడాది క్రితం రూ.20.7 లక్షల కోట్లుగా ఉంది. దీంతో మొత్తం రిటైల్ రుణాలలో వారి వాటా 26 శాతానికి చేరుకుంది. డిసెంబరు 2021 నాటికి మహిళా రుణగ్రహీతల వాటా 25.3 శాతంగా ఉంది. రుణ సమాచార కంపెనీ క్రిఫ్ హైమార్క్ విశ్లేషణ ప్రకారం, రుణ పోర్టిఫోలియో ఆస్తి రుణాల ద్వారా 26 శాతం పెరిగి రూ.7,88,827 కోట్లకు లేదా 29 శాతంగా ఉంది. అలాగే బంగారం రుణాలు 64 శాతం పెరిగి రూ.7,06,047 కోట్లకు లేదా మొత్తంలో 42 శాతానికి పెరిగాయి. ఇది కుటుంబాలు ఎదుర్కొంటున్న ఆర్థిక ఒత్తిడి పెరుగుతున్న స్థాయిని సూచిస్తుంది. గృహ రుణాలు 20 శాతం పెరిగి రూ.30,52,041 కోట్లకు లేదా డిసెంబరు 2022 నాటికి రూ.25,86,902 కోట్లుగా ఉన్నప్పుడు డిసెంబరు 2022 నాటికి బకాయిల్లో 32 శాతానికి పెరిగాయి. వ్యాపార రుణాలు 25 శాతం వృద్ధితో రూ.13,73,899 కోట్లకు లేదా మొత్తంలో 23 శాతానికి పెరిగాయి. ఇది ఏడాది క్రితం 22 శాతంతో పోలిస్తే వ్యక్తిగత రుణాలు 35 శాతం పెరిగి రూ.10,05,864 కోట్లకు చేరాయి. వ్యవసాయం, ట్రాక్టర్ రుణాలు 8 శాతం లాభపడి రూ.9,14,412 కోట్లకు లేదా మొత్తంలో 19 శాతానికి చేరుకున్నాయని విశ్లేషణలో తేలింది. వాహన రుణాలు 26 శాతం పెరిగి రూ.5,72,366 కోట్లకు చేరి 18 శాతంగా ఉంది. విద్యా రుణాలు 25 శాతం పెరిగి రూ.1,29,598 కోట్లకు చేరాయి. ఇది బకాయిల్లో 35 శాతం. ద్విచక్ర వాహన రుణాలు 42 శాతం లాభపడి రూ.1,00,042 కోట్లుగా ఉంది. అంతేకాకుండా, వినియోగదారు మన్నికైన రుణాలు 29 శాతం పెరిగి రూ.57,700 కోట్లకు లేదా 23 శాతానికి చేరాయి. ఇతర రిటైల్ రుణాలు 19 శాతం పెరిగి రూ.13,28,115 కోట్లకు లేదా 19 శాతానికి పెరిగాయి. గృహ రుణాల కోసం మహిళా రుణగ్రహీతలలో మొదటి ఐదు రాష్ట్రాలు మహారాష్ట్ర రూ.2,18,162 కోట్లు, కర్ణాటక రూ.99,679 కోట్లు, తమిళనాడు రూ.92,841 కోట్లు, గుజరాత్ రూ.75,843 కోట్లు, తెలంగాణ రూ.75,837 కోట్లతో ఉన్నాయి. ఇక వ్యాపార రుణాల విషయానికి వస్తే, మహారాష్ట్ర రూ.47,225 కోట్లతో అగ్రస్థానంలో ఉండగా, తమిళనాడు రూ.41,700 కోట్లు, కర్ణాటక రూ.25,890 కోట్లు, గుజరాత్ రూ.22,692 కోట్లు, ఉత్తరప్రదేశ్ రూ.20,252 కోట్లు తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

వ్యక్తిగత రుణ గ్రహీతల జాబితాలో తమిళనాడు రూ.22,247 కోట్లు, మహారాష్ట్ర రూ.20,988 కోట్లు, కర్ణాటక రూ.17,795 కోట్లు, తెలంగాణ రూ.15,454 కోట్లు, ఆంధ్రప్రదేశ్ రూ.12,837 కోట్లతో అగ్రస్థానంలో ఉన్నాయి. అలాగే వ్యవసాయ, ట్రాక్టర్ రుణాల్లో ఆంధ్ర ప్రదేశ్ రూ.24,549 కోట్లతో అగ్రస్థానంలో ఉండగా, ఉత్తరప్రదేశ్ రూ.20,344 కోట్లు, తమిళనాడు రూ.16,616 కోట్లు, కేరళ రూ.15,240 కోట్లు, కర్ణాటక రూ.14,878 కోట్లతో ఉన్నాయి. ఆస్తి రుణాల్లోనూ మహారాష్ట్ర రూ.40,477 కోట్లతో అగ్రస్థానంలో ఉండగా, తమిళనాడు రూ.28,461 కోట్లు, కర్ణాటక రూ.24,357 కోట్లు, గుజరాత్ రూ.19,279 కోట్లు, తెలంగాణ రూ.15,372 కోట్లతో ఉన్నాయి. దక్షిణాది రాష్ట్రాల నుంచి మహిళా రుణగ్రహీతలు తమ పశ్చిమ, ఉత్తర ప్రత్యర్థులతో పోలిస్తే, అధిక రుణాలు పొంది ఉన్నారని ఈ విశ్లేషణ పేర్కొంది. 35 ఏళ్లలోపు మహిళా రుణగ్రహీతల వాటా గత మూడేళ్లలో 2020లో 38.3 శాతం నుంచి 2022లో 43.4 శాతానికి పెరుగుతూనే ఉంది. అయితే 35-50 ఏళ్లలోపు వారి వాటా 43.5 శాతం నుంచి క్షీణించింది.

అంతర్జాతీయ మహిళాదినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య స్థానిక శాఖ అధ్వర్యాన ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలంలో అనేక కేంద్రాలలో జిల్లా మహిళా సమాఖ్య నాయకులు సీహెచ్ దుర్గాకోటేశ్వరరావు నాయకత్వంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. పోరాటనగర్‌లో జరిగిన భారీ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు.

కాన్పూర్‌లో జ్వర పీడితులు

భారీగా ఆసుపత్రులకు జనం

కాన్పూర్: కోవిడ్ తగ్గుముఖం పట్టిందనుకొంటున్న సమయంలో హెచ్3ఎన్2 ఇన్ఫ్లూయెంజా వైరస్ విజృంభిస్తోంది. తాజాగా ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్ నగరంలోని హాల్లెట్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఒక్క రోజులో జ్వరం, నిరంతరాయంగా దగ్గు, శ్వాసకోశ సమస్యలతో 200 కేసులు వచ్చాయి. వీటిల్లో 50 మంది రోగులను ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. ఈ ఆసుపత్రి బయట రోగులు బారులు తీరారు. మరోవైపు ప్రైవేటు వైద్యశాలలకు జ్వర బాధితులు పోటెత్తారు. ఇన్ఫ్లూయెంజా ఎ వైరస్‌కు ఉపరకంగా భావిస్తున్న హెచ్3ఎన్2 వైరస్ గత నెల రోజులుగా నగరంలో తీవ్రంగా వ్యాపించిందని నిపుణులు తెలిపారు. హాల్లెట్ ఆసుపత్రిలో ఎమర్జెన్సీ వార్డు కిక్కిరిసిపోవడంతో రోగులను ఇతర వార్డులకు తరలించాల్సి వచ్చింది.. తొలుత ఐదు నుంచి ఆరు రోజుల పాటు జ్వరం, దగ్గు లక్షణాలు కనిపించాయి. ఆ తర్వాత శ్వాస తీసుకోవడంలో సమస్యలు తలెత్తడంతో కాన్పూర్‌లోని వైద్యశాలకు తరలించామని ఓ రోగి బంధువు చెప్పారు. ఈ పరిస్థితిపై ఆసుపత్రిలోని మెడిసిన్ డిపార్ట్‌మెంట్ అధిపతి రిచా గిరి మాట్లాడుతూ వాస్తవానికి ఏటా వాతావరణ మార్పులు వచ్చినప్పుడు ఇటువంటి కేసులు చూస్తామని, కానీ, ఈ సారి రోగుల సంఖ్య చాలా ఎక్కువగా ఉందని చెప్పారు. వారిలో ఎక్కువ మందిలో జ్వరం, దగ్గు, శ్వాసకోశ సమస్యలున్నాయి. 24 గంటల్లో కేవలం శ్వాసకోశ సమస్యలతోనే 24 మంది వైద్యశాలలో చేరారు. వారికి ఆక్సిజన్ అందించాల్సిన పరిస్థితి నెలకొంది. కొంతమంది వెంటిలేటర్లపై ఉన్నారు. వీరిలో కొంతమందికి బైపాప్ యంత్రం వాడాల్సి వచ్చింది. కోవిడ్-19 కాకుండా వేరే వైరస్‌గా గుర్తించడం చాలా క్లిష్టం. ఇన్ఫ్లూయెంజా ఎ వైరస్‌లో ప్రతి ఉపరకానికి ప్రత్యేకమైన కిట్ ఉంది" అని వెల్లడించారు. ఇటీవల దేశవ్యాప్తంగా ఆస్పత్రిలో చేరుతున్న వారిలో దాదాపు సగం మంది శ్వాసకోశ సమస్యలతో బాధపడుతున్నవారే.

పీడీఎఫ్ అభ్యర్థుల గెలుపును ఆపలేరు

- పరస్పర సహకారంతో అభ్యర్థులను గెలిపించుకుందాం
- ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తున్న వైసీపీకి బుద్ధి చెబుదాం
- ఆత్మీయ సమ్మేళనంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పిలుపు

విశాలాంధ్ర-కల్లూరు: ఈ నెల 13వ తేదీన పట్టభద్రుల, ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీడీఎఫ్ అభ్యర్థుల విజయం ఖాయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. కర్నూలు నగరంలోని ఎస్టీయూ భవన్‌లో గురువారం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముఖ్యమంత్రి జగన్ అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారన్నారు. గతంలో ఏ సీఎం కూడా గ్రాడ్యుయేట్, టీచర్ల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయించేవారు కాదన్నారు. రాజశేఖర్ రెడ్డి, చంద్రబాబు కూడా పోటీ చేయించలేదన్నారు. కానీ సీఎం జగన్ మాత్రం వీటిలో కూడా అడుగుపెట్టి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ధర్మ యుద్ధం కాకుండా అధర్మయుద్ధం చేయడానికి ప్రయత్నిస్తున్నారని, అభ్యర్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. దొంగ ఓట్లు వేయించుకునేందుకు ఇప్పటికే జిల్లాల వారిగా భారీగా నమోదు చేయించారన్నారు. ఈ ప్రభుత్వానికి టీచర్లు, లెక్చరర్లు అంటే లెక్క లేకుండా పోయిందని తగిన మూల్యం చెల్లించుకోవడం ఖాయమని అన్నారు. పట్టభద్రుల నియోజకవర్గం అభ్యర్థి పోతుల నాగరాజుకు టీడీపీ వారు రెండవ ప్రాధాన్యత ఓటు, ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్న కత్తి నరసింహారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. పీడీఎఫ్ అభ్యర్థులను బలపరుస్తున్న ఓటర్లు కూడా పోతుల నాగరాజుకు మొదటి ప్రాధాన్యత ఓటు, టీడీపీ అభ్యర్థికి రెండవ ప్రాధాన్యత ఓటు వేయాలని సూచించారు. ఓట్లు చీలకుండా రెండు పార్టీల నేతలు జాగ్రత్త వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి తిమ్మన్న, సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య, ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెనిన్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు మునెప్ప, రసూల్, నగర కార్యదర్శి రామకృష్ణ, ఎస్టీయు నాయకులు షణ్ముర్తి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేపాల్ కొత్త అధ్యక్షుడు రామ్ చంద్ర పాడెల్

ఖాట్మండు: నేపాలీ కాంగ్రెస్ సీనియర్ నేత రామ్ చంద్ర పౌడెల్ నేపాల్ కొత్త అధ్యక్షుడిగా గురువారం ఎన్నికయ్యారు. ఈయన దేశానికి మూడవ అధ్యక్షుడు. నేపాలీ కాంగ్రెస్, సీపీఎన్ (మావోయిస్ట్ సెంటర్)తో సహా ఎనిమిది పార్టీల కూటమి ఉమ్మడి అభ్యర్థిగా పౌడెల్ అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. పార్లమెంటులో 214 , ప్రావిన్షియల్ అసెంబ్లీల సభ్యులు 352 మంది ఓట్లను ఆయన పొందారు. అధ్యక్ష ఎన్నికలకు అర్హులైన ఓటర్లు మొత్తం 882 మంది. ఇందులో పార్లమెంటు సభ్యులు 352 మంది, ఏడు ప్రావిన్సుల్లోని అసెంబ్లీల సభ్యులు 550 మంది ఉన్నారు. 518 మంది ప్రావిన్షియల్ అసెంబ్లీ సభ్యులు, 313 మంది ఫెడరల్ పార్లమెంట్ సభ్యులు ఓటింగ్‌లో పాల్గొన్నట్లు ఎన్నికల కమిషన్ అధికార ప్రతినిధి షాలిగ్రామ్ తెలిపారు. దేశాధ్యక్షుడిగా ఎన్నికైన రామ్ చంద్ర పౌడెల్‌కు నేపాలీ కాంగ్రెస్ అధ్యక్షుడు షేర్ బహదూర్ డ్యూబా శుభాకాంక్షలు తెలిపారు. 'మిత్రుడా నీకు హృదయపూర్వక అభినందనలు' అంటూ ట్వీట్ చేశారు.

సీపీఎస్ రద్దు చేయాల్సిందే

ధర్నాలో సీపీఐ, సీపీఎం నేతల డిమాండ్

విశాలాంధ్ర- తిరుపతి బ్యూరో: సీపీఎస్‌ను రద్దు చేసి ఇచ్చిన మాటను సీఎం జగన్ నిలబెట్టుకోవాలన్న డిమాండుతో సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ధర్నాలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ టీచర్స్ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలలో ఉద్యోగులు ప్రచారంలో పాల్గొంటే చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి చెప్పడం అన్యాయమన్నారు. వలంటీర్లను ఎన్నికల ప్రచారానికి ఎందుకు వాడుకుంటున్నారని ప్రశ్నించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై రాజకీయ పెత్తనం ఎక్కువైందని, టీచర్ల విషయంలో చాలా దుర్మార్గంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని విమర్శించారు. సీఎం తక్షణమే ప్రభుత్వోద్యోగులను వేధించడం మానుకోవాలన్నారు. సీపీఎస్ రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎ.రామానాయుడు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచలయ్య, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు పి.మురళి, వందవాసి నాగరాజు, సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ, సీపీఎం నేత కందారపు మురళి పాల్గొన్నారు.

అంతర్గత ఫిర్యాదు కమిటీలతో

మహిళలపై లైంగిక వేధింపులకు చెక్

మంత్రి ఉషశ్రీ చరణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: మహిళా ఉద్యోగులపై జరిగే లైంగిక వేధింపుల నివారణకు అంతర్గత ఫిర్యాదు కమిటీలు ప్రధాన భూమిక పోషిస్తాయని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం మార్గదర్శకాలు, రాష్ట్రప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం అన్ని శాఖాధిపతులు, ప్రైవేటు కార్యాలయాల్లో ఈ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. గురువారం వెలగపూడి సచివాలయం ఐదోబ్లాక్ సమావేశ మందిరంలో 'పని ప్రదేశంలో మహిళలపై లైంగిక వేధింపుల చట్టం-2013' అమలు తీరుపై రాష్ట్ర మహిళా కమిషన్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించింది. సమావేశంలో ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ సీఎం జగన్ మహిళల భద్రతకు, సంక్షేమానికి, సాధికారతకు అధిక ప్రాధాన్యతనిస్తూ వివిధ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. బడ్జెట్‌లో భారీగా నిధులను మహిళల సంక్షేమం, అభివృద్ధికి కేటాయించినట్లు తెలిపారు. ఫలితంగా మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, విద్యా, ఆరోగ్య పరంగా అభివృద్ధి పథంలో ముందుకెళ్తున్నారన్నారు. ఇతర రాష్ట్రాలతో పోల్చితే ఆంధ్రప్రదేశ్‌లో మహిళల ఫిర్యాదులు తక్కువని, జగనన్న ప్రభుత్వ చర్యలే ఇందుకు కారణమని తెలిపారు. పని ప్రదేశంలో లైంగిక వేధింపులకు ఆస్కారం లేకుండా ఉండేందుకు మహిళలు వారి సమస్యలను నిర్భయంగా వెల్లడించేందుకు అంతర్గత ఫిర్యాదు కమిటీలు ప్రధాన వేదికలవుతాయని అన్నారు. రాష్ట్రం నుంచి గ్రామీణ స్థాయి వరకు మహిళా ఉద్యోగులకు ఈ కమిటీలపై పూర్తి అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వాసిరెడ్డి పద్మ మాట్లాడుతూ మహిళల భద్రత, సాధికారత సాధనలో దేశానికే ఆంధ్రప్రదేశ్ ఆదర్శమన్నారు. మహిళా సమస్యల పరిష్కారానికి, వారి రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న చాలా పథకాలు, కార్యక్రమాలపై మహిళల్లో అవగాహన కల్పించేందుకు గతేడాది మార్చి 8న సీఎం జగన్...సబల కార్యక్రమాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ గతేడాది నుంచి ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందన్నారు. గుంటూరు, ఏలూరు, కర్నూలు, విశాఖపట్నంలో ప్రాంతీయ అవగాహన సదస్సులు నిర్వహించామన్నారు. వివిధ శాఖాధిపతుల కార్యాలయాల్లో ఏర్పాటు చేసిన అంతర్గత ఫిర్యాదుల కమిటీలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ సంచాలకులు బి.ప్రకాశ్ రెడ్డి, వివిధ శాఖాధిపతుల కార్యాలయాలలోని అంతర్గత ఫిర్యాదుల కమిటీల ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

తల్లి పులి జాడేది?

విశాలాంధ్ర బ్యూరో-కర్నూలు: నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం పెద్దగుమ్మడారం సమీపంలో నాలుగు రోజుల క్రితం నాలుగు పెద్దపులి పిల్లలను కనిపించడం గ్రామస్తులను భయభ్రాంతులకు గురి చేసిన విషయం విదితమే. అయితే పులికూనలను వాటి తల్లి (పెద్దపులి)వద్దకు చేర్చాలన్న అటవీ శాఖాధికారుల ప్రయత్నాలు ఫలించడం లేదు. పెద్దపులి తన కూనలను వదిలి ఎక్కడికి పోయిందని ప్రశ్నార్థకంగా మారింది. అది భయంతో అడవిలోకి పోయిందా లేక వేటగాళ్ల ఉచ్చుల్లో చిక్కుకుందా అనే ప్రశ్న ఉత్పన్నమైంది. అయితే బుధవారం మండలంలోని ముసలమడుగు గ్రామం వద్ద రోడ్డు దాటుతున్న ఒక పెద్దపులిని చూసిన గ్రామస్తులు, మేకల కాపరులు వెంటనే అటవీ అధికారులకు తెలిపారు. అధికారులు పులి పాదముద్రలను పరిశీలించినప్పటికీ అది తల్లిపులా కాదా అని నిర్ధారణ చేయలేకపోతున్నారు. తల్లి పులి కోసం అధికారులు పెద్దఎత్తున గాలింపు చర్యలు చేపట్టారు. నల్లమల అడవిలోని సుమారు 200 కిలో మీటర్ల పరిధిలో పులి జాడ కోసం సుమారు 40ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. నీటి కుంటలు, మడుగుల వద్ద, పులి ఆవాస కేంద్రాల వద్ద ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేసి గుర్తింపు పనిలో ఉన్నారు. పులి పిల్లలను అటవీ అధికారుల రక్షణలో ఉంచారు. తల్లిపులి జాడ దొరికితే దాని వద్దకు చేర్చేందుకు ప్రయత్నం చేస్తున్నారు. ఒక వేళ తల్లి పులి జాడ లేకుంటే వాటిని రెండు సంవత్సరాల పాటు జూపార్కులో ఉంచి తరువాత నల్లమల అడవుల్లో వదిలి వేసే విధంగా అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ అభ్యర్థుల నామినేషన్

ఏడుగురికి సీఎం బీ ఫారాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఏడుగురు వైసీపీ అభ్యర్థులు గురువారం నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో పెనమత్స సురేష్, ఇజ్రాయల్, కోలా గురువులు, చంద్రగిరి ఏసురత్నం, పోతుల సునీత, జయమంగళ వెంకటరమణ, మర్రి రాజశేఖర్ ఉన్నారు. తొలుత వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు సీఎం క్యాంపు కార్యాలయానికి చేరుకోగా, వారికి బీ ఫారాలను ముఖ్యమంత్రి జగన్ అందజేశారు. అనంతరం అసెంబ్లీ కార్యాలయంలో నామినేషన్లను అభ్యర్థులు దాఖలు చేశారు.

జగన్ సోషల్ ఇంజినీరింగ్‌కు నిదర్శనం: సజ్జల

వైసీపీ నియమంగా సామాజికవర్గ సాధికారతకు కంకణం కట్టుకున్నాదని, అది సీఎం జగన్ సోషల్ ఇంజినీరింగ్‌కు నిదర్శనమని పార్టీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి చెప్పారు. ఏడుగురు వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసిన సందర్భంగా శాసనమండలి కార్యాలయం వద్ద విలేకరులతో సజ్జల మాట్లాడారు. 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 11మంది బీసీలకు పదవులను కేటాయించామని, జగన్ అధికారంలోకి వచ్చిన నాటినుంచి అమలు చేస్తున్న సోషల్ ఇంజనీరింగన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలోనూ ఇది కనిపించిందన్నారు. మొదటి నుంచి సామాజిక న్యాయమనేది వైసీపీ ప్రభుత్వ విధానంగా చిత్తశుద్ధితో అమలు చేస్తున్నట్లు తెలిపారు. పోటీ జరిగే 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 స్థానాలు బీసీ, ఎస్సీ, ఎస్టీల అభ్యర్థులకు ఇవ్వగా... అందులో 11 స్థానాలు బీసీలకు కేటాయించడం చరిత్రాత్మకమన్నారు. రాజకీయ సాధికారత దిశగా నామినేటెడ్ పదవులు మొదలుకుని, ఎన్నికయ్యే పదవుల వరకు ఎక్కడ అవకాశముంటే అక్కడ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీలకు పెద్దపీట వేయడంలో సీఎం విప్లవాత్మక చొరవ చూపుతున్నారన్నారు.

ఖవాజా సెంచరీ

- అహ్మదాబాద్ టెస్టులో భారీ స్కోరు దిశగా ఆసీస్
- తొలి ఇన్నింగ్స్ స్కోరు 255/4

అహ్మదాబాద్: బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా అహ్మదాబాద్‌లో గురువారం ప్రారంభమైన నాలుగో టెస్టులో ఆస్ట్రేలియా భారీస్కోరు దిశగా పయనిస్తోంది. మొదటి రోజు ఆట ముగిసే సమయానికి ఆసీస్ తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 255 పరుగుల స్కోరు చేసింది. చేతిలో ఇంకా 6 వికెట్లు ఉండడం, పిచ్ బ్యాటింగ్‌కి చక్కగా సహకరిస్తుండడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఆస్ట్రేలియా 350-400 స్కోరు చేసేలా కనిపిస్తోంది. ఒకపక్క ఓపెనర్ ఉస్మాన్ ఖవాజా 251 బంతుల్లో 15 ఫోర్లతో సెంచరీ (104) పూర్తి చేసుకుని అజేయంగా నిలవగా, మరోపక్క కామెరూన్ గ్రీన్ 49 పరుగులతో క్రీజులో ఉన్నాడు. తొలుత టాస్ గెలిచిన ఆసీస్ కెప్టెన్ స్టీవ్ స్మిత్ మరో ఆలోచన లేకుండా బ్యాటింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కి చక్కగా అనుకూలిస్తున్న పిచ్‌పై ట్రావిస్ హెడ్, ఉస్మాన్ ఖవాజా ఇచ్చిన క్యాచులను భారత వికెట్ కీపర్ శ్రీకర్ భరత్ ఒడిసిపట్టలేకపోయాడు. తొలి వికెట్‌కి 61 పరుగుల భాగస్వామ్యం జోడించిన తర్వాత ట్రావిస్ హెడ్ వికెట్ కోల్పోయింది ఆస్ట్రేలియా. 44 బంతుల్లో 7 ఫోర్లతో 32 పరుగులు చేసిన ట్రావిస్ హెడ్, రవిచంద్రన్ అశ్విన్ బౌలింగ్‌లో రవీంద్ర జడేజాకి క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. ఆ తర్వాత 20 బంతుల్లో 3 పరుగులు చేసిన మార్నస్ లబుషేన్, మహ్మద్ షమీ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయ్యాడు. 72 పరుగుల వద్ద ఆస్ట్రేలియా రెండో వికెట్ కోల్పోయింది. అయితే ఆ తర్వాత ఉస్మాన్ ఖవాజా, స్టీవ్ స్మిత్ కలిసి ఆస్ట్రేలియాని ఆదుకున్నారు. తొలి రోజు మొదటి సెషన్ ముగిసే సరికి 2 వికెట్ల నష్టానికి 75 పరుగులు చేసిన ఆస్ట్రేలియా, రెండో సెషన్‌లో భారత బౌలర్లను సమర్థవంతంగా అడ్డుకోవడంలో సఫలమైంది. కెప్టెన్ రోహిత్ శర్మ... ఉమేశ్ యాదవ్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్, రవిచంద్రన్ అశ్విన్, మహ్మద్ షమీ... ఇలా బౌలర్లను మార్చి మార్చి ప్రయోగించినా టీమిండియాకి ఫలితం దక్కలేదు. షమీ బౌలింగ్‌లో ఫోర్ బాది, 146 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేసుకున్నాడు ఉస్మాన్ ఖవాజా. అతనికి ఇది టెస్టుల్లో 22వ అర్ధ సెంచరీ కాగా ఈ సిరీస్‌లో మూడోది. ఇక రెండో సెషన్‌లో ఆస్ట్రేలియా వికెట్ కోల్పోకుండా బ్యాటింగ్ చేసింది. అయితే టీ బ్రేక్ ముగిసిన తర్వాత స్టీవ్ స్మిత్‌ని క్లీన్ బౌల్డ్ చేశాడు రవీంద్ర జడేజా. 135 బంతుల్లో 3 ఫోర్లతో 38 పరుగులు చేసిన స్టీవ్ స్మిత్, జడ్డూ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ కావడం ఇది నాలుగోసారి. ఆ తర్వాత 27 బంతుల్లో 3 ఫోర్లతో 17 పరుగులు చేసిన పీటర్ హ్యాండ్స్‌కోంబ్, మహ్మద్ షమీ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యాడు. 170 పరుగుల వద్ద నాలుగో వికెట్ కోల్పోయినప్పటికీ క్రీజులోకి వస్తూనే దూకుడుగా ఆడిన కామెరూన్ గ్రీన్... ఉస్మాన్ ఖవాజాతో కలిసి ఐదో వికెట్‌కి 116 బంతుల్లోనే అజేయంగా 85 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. కామెరూన్ గ్రీన్ 64 బంతుల్లో 8 ఫోర్లతో 49 పరుగులు చేయగా ఉస్మాన్ ఖవాజా 251 బంతుల్లో 15 ఫోర్లతో 104 పరుగులు చేశాడు. ఈ సిరీస్‌లో తొలి సెంచరీ బాదిన ఆస్ట్రేలియా బ్యాటర్‌గా నిలిచాడు.

నోరుందిగానీ చెవులే లేవు...

గవర్నర్ల వైఖరిపై స్టాలిన్ విమర్శ

చెన్నై: కొన్ని రాష్ట్రాల్లో గవర్నర్లు అక్కడి ప్రభుత్వాలకు మధ్య ఘర్షణ క్రమంలో గవర్నర్ల పనితీరుపై తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజా పరిస్థితుల ప్రకారం కొందరు గవర్నర్లు ఎక్కువగా మాట్లాడుతూ.. తక్కువగా వింటున్నట్లు స్పష్టమవుతోందని అన్నారు. ఆన్‌లైన్ జూద నిరోధంపై రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన బిల్లును తమిళనాడు గవర్నర్ తిప్పి పంపిన నేపథ్యంలో స్టాలిన్ ఈ వ్యాఖ్యలు చేశారు. 'ఉంగలిల్ ఒరువన్' కార్యక్రమంలో భాగంగా ప్రజల ప్రశ్నలకు వీడియో ద్వారా స్టాలిన్ సమాధానాలిచ్చారు. గవర్నర్లకు నోరు ఉందిగానీ చెవులు లేవని తాజా పరిస్థితులు సూచిస్తున్నాయని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా అరెస్టుపై మాట్లాడుతూ విపక్షాలను బీజేపీ బెదిరిస్తోందనేందుకు ఇది స్పష్టమైన ఉదాహరణ అన్నారు. సిసోడియా అరెస్టును ఖండించారు. రాజకీయ కారణాల కోసమే దర్యాప్తు సంస్థలను కేంద్రం దుర్వినియోగిస్తోందని విమర్శించారు. రాష్ట్రంలో వలస కార్మికులపై వదంతులను తోసిపుచ్చారు. ఉత్తరాదికి చెందిన బీజేపీ నేతలు దురుద్దేశంతో తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఆన్‌లైన్ జూదానికి వ్యతిరేకంగా రూపొందించిన బిల్లును గవర్నర్ ఎందుకు వెనక్కి పంపారో తెలియదని, అందుకు కారణాలు తెలిపితే దానిని పరిశీలించే అవకాశం ఉంటుందని తమిళనాడు న్యాయ మంత్రి ఎస్ రేగుపతి వెల్లడించారు. బిల్లును అసెంబ్లీ మళ్లీ పంపితే దానిని ఆమోదించడం గవర్నర్ బాధ్యతని అన్నారు. తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవి, ముఖ్యమంత్రి మధ్య ఘర్షణ వాతావరణం ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో స్పష్టంగా కనిపించింది. అసెంబ్లీలో ప్రసంగం సమయంలో ప్రభుత్వ నివేదికలోని కొన్ని పేరాలను గవర్నర్ వదిలేసి చదవడం వివాదానికి కారణమైంది. దీనిపై స్టాలిన్ తీవ్రంగా స్పందించారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే... చర్చల హడావుడి

వైసీపీ అభ్యర్థులను ఓడించండి: ఎస్టీయూ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈ నెల 13వ తేదీ జరగనున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో లబ్ధి కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ సంఘాలతో చర్చల పేరుతో హడావుడీ చేస్తోందని ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్న గురువారం ఒక ప్రకటనలో విమర్శించారు. ఈ ప్రభుత్వం చేస్తున్న హడావుడిని రాష్ట్రంలోని 13 లక్షల మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు ఎవరూ నమ్మడం లేదన్నారు. నాలుగేళ్లుగా ఒక్క కరువు భత్యమూ విడుదల చేయని ప్రభుత్వం...ఎన్నికలకు మూడ్రోజుల ముందు ఉద్యోగ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి, సమస్యలు పరిష్కరిస్తామని అధికారులు హడావుడి చేస్తున్నారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో లబ్ధి కోసమే ప్రభుత్వం ఆరాట పడుతోందని, దీనిని ఉద్యోగ, ఉపాధ్యాయులంతా గమనించాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు, పెన్షనర్లకు ఆర్థికపరమైన ప్రయోజనాలు నిలిచిపోయాయని, 11వ పీఆర్సీ బకాయిలు, నాలుగు విడుదల, కరువు భత్యం, ఉద్యోగులు, ఉపాధ్యాయులు దాచుకున్నటువంటి భవిష్యనిధి రుణాల చెల్లింపులు, మెడికల్ రీయింబర్స్‌మెంట్, సంపాదిత సెలవు, నగదీకరణ తదితర ఆర్థిక ప్రయోజనాలు మూడేళ్లుగా నిలిచిపోయాయని వివరించారు. ఆర్థిక ప్రయోజనాలన్నీ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. 34వేల మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తామన్న ప్రభుత్వం ఒక్కరికీ కల్పించలేకపోయిందని, కనీసం ఉపాధ్యాయ బదిలీలు చేయలేని స్థితిలో ప్రభుత్వం ఉండడం అత్యంత శోచనీయమని విమర్శించారు. 13వ తేదీ జరగనున్న 5 ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థులను ఓడించడానికి ఉద్యోగులు, ఉపాధ్యాయులు పట్టభద్రులు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారన్నారు.

భారత్, ఆసీస్ ప్రధానుల సందడి

అహ్మదాబాద్: భారత్ ఆస్ట్రేలియా జట్ల మధ్య ఇక్కడి నరేంద్ర మోదీ స్టేడియంలో నాలుగో టెస్ట్ మ్యాచ్ గురువారం ఉదయం అట్టహాసంగా ప్రారంభమయ్యింది. ఈ మ్యాచ్‌ను తిలకించేందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు ఆస్ట్రేలియా ప్రధాని ఆంటోనీ అల్బనీస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అక్కడ ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను ఇరువురు ప్రధానులు తిలకించారు. 75 ఏళ్ల భారత్-ఆస్ట్రేలియా మైత్రి సంబరాల్లో భాగంగా వీరిద్దరూ మ్యాచ్‌ను ప్రత్యేక్షంగా తిలకించారు. ఒకవైపు సిరీస్ ఫలితాన్ని నిర్ణయించే మ్యాచ్... మరోవైపు ఇద్దరు దేశ ప్రధానులు రావడంతో అభిమానులతో స్టేడియం మొత్తం కిక్కిరిసిపోయింది. ఈ సందర్భంగా ఇరు దేశాల ప్రధానులను బీసీసీఐ ప్రత్యేకంగా సత్కరించింది... రెండు దేశాల మధ్య 75 ఏళ్ల స్నేహానికి గుర్తుగా బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీ... ఆస్ట్రేలియా ప్రధాని అంటోనీ అల్బనీస్‌కు మెమొంటోను ప్రదానం చేయగా, బీసీసీఐ కార్యదర్శి జైషా ప్రధాని నరేంద్రమోదీకి ఓ జ్ఞాపికను అందజేశారు. అయితే మ్యాచ్‌కు ముందు ఆసక్తికరమైన సన్నివేశం చోటు చేసుకుంది. టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, ప్రధాని మోదీ, ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్‌కు ఆసీస్ ప్రధాని టెస్టు క్యాప్‌లు అందజేశారు. అనంతరం ఇద్దరు ప్రధానులు గోల్డ్ పూత పూసిన గోల్ఫ్ కారులో స్టేడియం మొత్తం తిరుగుతూ అభిమానులకు అభివాదం చేశారు. తర్వాత ఇద్దరూ తమ తమ జట్లతో కలిసి జాతీయగీతాన్ని ఆలపించారు.

డబ్ల్యూపీఎల్‌కు గుజరాత్ జెయింట్స్ కెప్టెన్ దూరం

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) టోర్నీకి గుజరాత్ జెయింట్స్ జట్టు కెప్టెన్ బేత్ మూనీ దూరమైంది. లీగ్ ప్రారంభ మ్యాచ్‌లో గాయపడిన ఆమె కోలుకునేందుకు మరింత సమయం పట్టనుంది. దాంతో టోర్నీ నుంచి తప్పుకోనుంది. ఈ వికెట్ కీపర్, బ్యాటర్ స్థానంలో లారా వొల్వార్ట్ (దక్షిణాఫ్రికా)ను గుజరాత్ యాజమాన్యం జట్టులోకి తీసుకుంది. ప్రస్తుతం ఆమె రెండు ఎగ్జిబిషన్ మ్యాచ్‌ల కోసం పాకిస్తాన్‌లో ఉంది. ఢిల్లీ క్యాపిటల్స్‌లో శనివారం (మార్చి 11న) జరిగే మ్యాచ్‌కు జట్టుతో కలవనుంది. డబ్ల్యూపీఎల్ ఆరంభ మ్యాచ్‌లో మూనీ తొలి ఓవర్‌లోనే రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది. చీలమండకు గాయం కావడంతో ఆమె నొప్పితో విలవిలలాడుతూ మైదానం వీడింది. అయితే గుజరాత్ ఆఖరి వికెట్‌గా ఆమె బ్యాటింగ్ చేసేందుకు సిద్ధంగా లేకపోవడంతో అంపైర్లు ముంబై ఇండియన్స్‌ని విజేతగా ప్రకటించారు. 'డబ్ల్యూపీఎల్ తొలి సీజన్ మిస్ అవుతున్నందుకు చాలా బాధగా ఉంది. అయితే నేను మైదానంలో దిగకున్నా.. జట్టు ప్రదర్శనను నిత్యం గమనిస్తూనే ఉంటాను. వచ్చే సీజన్‌కు మరింత స్ట్రాంగ్‌గా, ఫిట్‌గా తయారై వస్తాను. గుజరాత్ జెయింట్స్ బృందానికి ఆల్ ది బెస్ట్' అని మూనీ వెల్లడించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.